రాజకీయాలకు.. గుడ్ బై



- నిర్ణయించుకున్న ఎంపీ జయదేవ్
- త్వరలో పార్టీ శ్రేణులకు విందుతో వీడ్కోలు
- సీఎం జగన్ తీరుతో రాజకీయాలంటేనే విరక్తి
- హ్యాట్రిక్ కొట్టే అవకాశమున్నా పోటీకి విముఖత

గుంటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలు నాకొద్దు.. పోటీ కూడా చేయను.. ఇక గుడ్‌బై.. అని గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. గత ఎన్నికల్లో ప్రతిష్టాత్మకమైన విజయాన్ని సాధించిన జయదేవ్ రాజకీయాల నుంచి పూర్తిగా వైదొలిగేందుకు నిర్ణయించుకున్నారని తెలిసింది. తన వ్యాపార సామ్రాజ్యాన్ని మరింతగా విస్తృతం చేసుకోవాలనే లక్ష్యంతో జయదేవ్ దానిపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టేందుకు రాజకీయాల నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నారని తెలిసింది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, లోకేశ్‌తోనూ సన్నిహిత సంబంధాలు ఇన్నా ఎన్నికల్లో పోటీకి మాత్రం ససేమిరా అంటున్నారు. సంక్రాంతి పండుగ అనంతరం తల్లి అరుణతో గుంటూరు వచ్చి ఇన్నాళ్లు తమకు అండగా నిలిచిన పార్టీ శ్రేణులకు ఆతిథ్యం ఇచ్చి వీడ్కోలు చెప్పాలనే ఆలోచనలో జయదేవ్ ఉన్నారు. కొంతకాలం క్రితం వ్యాపార వ్యవహారాల్లో ఎదురైన ఒడిదుడుకుల మూలంగా అప్పటి నుంచి ఆయన పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటున్నారు. అయితే ఎంపీ పదవికి మాత్రం న్యాయం చేస్తూ పార్లమెంటు సమావేశాల్లో పలు సమస్యలపై గళం వినిపిస్తూ వచ్చారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జగన్ ఎంపీ జయదేవ్‌పై పగబట్టి ఆయన పరిశ్రమలను దెబ్బతీసే ప్రయత్నం చేశారు. చిత్తూరు జిల్లాలో ఉన్న అమరరాజా గ్రూప్ సంస్థలపైకి వివిధ ప్రభుత్వ శాఖలను ఉసిగొల్పి లేనిపోని కేసులు నమోదు చేస్తామనే బెదిరింపులతో అనేక పర్యాయాలు విసిగించారు. ఆ చర్యలతో జయదేవ్ కుటుంబీకులు మనస్తాపానికి గురయ్యారు. ఒక దశలో ఈ రాష్ట్రం నుంచే పరిశ్రమలను పొరుగు రాష్ట్రాలకు తరలించాలని నిర్ణయించుకున్నారు. జయదేవ్ ఆలోచనను తెలుసుకున్న తెలంగాణ, తమిళనాడు ముఖ్యమంత్రులు తమ రాష్ట్రానికి రావాలంటూ జయదేవ్‌ను ఆహ్వానించారు. పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామనే భరోసా ఇచ్చారు. అయితే తాము పుట్టి పెరి గిన తిరుపతి ప్రాంత ప్రజలకు ఉపాధి లేకుండా చేయాల్సి వస్తుందనే ఆలోచనతో తరలింపు ఆలోచన ఉపసంహరించుకుని కొత్తగా తలపెట్టిన పరిశ్రమ విస్తరణకు తెలంగాణను ఎంచుకున్నారు. అక్కడ పరిశ్రమ ఏర్పాటుతో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజల నుంచి అపకీర్తి మూటకట్టుకుంది. ఆ తర్వాత కూడా వారిని ఏదో ఒక సాకుతో వేధిస్తూ వచ్చారు. ముఖ్యమంత్రి జగన్ తీరుతో ఎంపీ జయదేవ్‌కు రాజకీయాలంటేనే విరక్తి ఏర్పడింది.

అనూహ్యంగా రాజకీయాల్లోకి..

వ్యాపారవేత్త అయిన గల్లా జయదేవ్ 2014 ఎన్నికల సమయంలో రాజకీయరంగ ప్రవేశం చేశారు. తన తాత రాజగోపాల్ నాయుడుకి సన్నిహితంగా ఉండే ఆచార్య రంగా ప్రాతినిధ్యం వహించిన గుంటూరు పార్లమెంటుపై ఉన్న మమకారంతోనే ఆయన అప్పట్లో పోటీకి ఈ నియోజకవర్గాన్ని ఎంచుకున్నారు. ఈ పరిస్థితుల్లో అనూహ్యంగా ఆయన టీడీపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగి విజయం సాధించి తొలిసారి చట్టసభలోకి అడుగు పెట్టారు. 2019 ఎన్నికల సమయంలో కూడా ఆయన గుంటూరు నుంచి పోటీ చేస్తారా, లేదా అనే ప్రచారం జరిగింది. అయితే ఎన్నికల సమయం ఆసన్నమయ్యేప్పటికి ఇక్కడ నుంచే పోటీ చేస్తానని జయదేవ్ స్వయంగా ప్రకటించి ఆ ప్రచారానికి తెరదించారు. ఆచార్య ఎన్జీ రంగా వంటి సీనియర్ పార్లమెంటేరియన్ ప్రాతినిధ్యం వహించిన గుంటూరును ఎట్టి పరిస్థితుల్లో వీడనని అప్పట్లో జయదేవ్ ప్రకటించారు. 2019 ఎన్నికల్లో తిరిగి టీడీపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగిన జయదేవ్ వైసీపీ అభ్యర్థి మోదుగుల వేణుగోపాల్‌రెడ్డిని ఓడించి టీడీపీకి ప్రతిష్టాత్మకమైన విజయాన్ని చేకూర్చారు. విశేషమేమిటంటే ఆ ఎన్నికల్లో వైసీపీ గాలిలో టీడీపీ అభ్యర్థులు ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పరాజయం పాలైనప్పటికీ జయదేవ్ గెలిచి తన సత్తా చాటుకున్నారు.

ఉత్తిపోతలే..


నకరికల్లు వద్ద గోదావరి జలాల ఎత్తి పోతల పథకానికి నాటి సీఎం చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసిన శిలాఫలకం

- గోదావరి జలాలకి గ్రహణం
- నాలుగున్నరేళ్లుగా రూపాయి విదిల్చలేదు
- 10 లక్షల ఎకరాల సాగునీటి భరోసాకు గండి
- సాగర్ ఆయకట్టుకి వరప్రదాయనిలాంటి పథకం

పేరు పెట్టి అటకెక్కించారు..

నాగార్జునసాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు తరలించేలా టీడీపీ ప్రభుత్వం రూపొందించిన ఎత్తిపోతల పథకానికి జగన్ ముఖ్యమంత్రి కాగానే తన తండ్రి వైఎస్ఆర్ పేరు పెట్టు కున్నారు. అలాగే ఈ ఎత్తిపోతల పథకం నిర్మా ణానికి రూ.6,020 కోట్లు కేటాయించి నట్లు 2020లో ప్రభుత్వం ప్రకటించింది. రెండు ప్యాకెజీలలో పనులు చేపట్టేందుకు కాంట్రా క్టర్లకు కూడా అప్పగించినట్లు తెలిపింది. అయితే ఇది ఆచరణలో అమలు కాలేదు. ఈ పథకం నిర్మాణానికి భూసేకరణ ఎక్కడవేసిన గొంగడి అక్కడనే అన్న చందాన మారింది. దీంతో కాంట్రాక్టర్లు పనులను నిలిపి వేశారు. ఈ పథకాన్ని సీఎం జగన్ పూర్తిగా అటకెక్కించారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) గోదావరి పెన్నా నదు ల అనుసందానంలో భాగంగా తొలిదశలో గోదావరి జలాలను నాగార్జున సాగర్ ఆయకట్టు తరలించేందుకు గత టీడీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాన్ని రూపొందించింది. రూ.6020 కోట్ల అంచనాలతో ఈ పథకాన్ని రూపొందించారు. అమరావతి మండలం వైకుంఠపురం వద్ద కృష్ణానది నుంచి 66.59 కిలో మీటర్ల పొడువునా పైపులైన్ నిర్మించి సాగర్ కాల్వ 80వ మైలు వద్దకు గోదావరి నీటిని ఎత్తిపోతల ద్వారా తరలించేలా నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు పథకాన్ని రూపొందించారు. 56.50 కిలోమీటర్లు గురు త్వాకర్షణ ద్వారా నీటిని తరలించాలని నిర్ణయిం చారు. 20 పంపుల ద్వారా 148.68 మీటర్ల ఎత్తుకు 10.09 కిలోమీటర్ల మేర నీటిని ఎత్తి పోయాల్సి ఉంటుంది. ఆయకట్టుకు 73 టీఎం సీల నీటిని సరఫరా చేసే సామర్ధ్యంతో పథకాన్ని రూపొందించారు. ఈ పథకం పూర్తి చేయడం ద్వారా ఏడు వేల క్యూసెక్కుల నీటిని కుడి కాలువకు తరలించాలి. పనులకు టెండర్లు కూడా నిర్వహించారు. 3,437 ఎకరాల భూమి అవసర మవుతుందని అంచనా వేసి సర్వే కూడా పూర్తి చేశారు. భూసేకరణకు రూ.955 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. భూసేకరణ ప్రకటనను రెవెన్యూ శాఖ జారీ చేసింది. అమరావతి, పెదకూరపాడు, క్రోసూరు, రాజుపాలెం మండలాల గుండా నకరికల్లు మండలంలోని సాగర్ కుడి ప్రధాన కాల్వలో గోదావరి నీటిని కలుపుతారు. ఎత్తిపోతల పథకం పనులను రెండు ప్యాకేజీలుగా విభజించి కాంట్రాక్టర్లకు ప్రభుత్వం అప్పగించింది. రూ.2281 కోట్లతో ఒక ప్యాకేజీ, రూ.2655 కోట్లతో రెండో ప్యాకేజీగా నిర్ణయించి ఇద్దరు కాంట్రాక్టర్లకు పనులు ఇచ్చారు. అయితే ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవ డంతో కాంట్రాక్టర్లు పనులు చేపట్ట లేదు. భూసేరణ ఇప్పట్లో జరిగే పరిస్థితులు కానరావడంలేదు. ఈ పథకాన్ని ప్రభుత్వం కొనసాగిస్తుందో లేదో అన్న సందేహాలు ఆయకట్టు రైతుల్లో నెలకున్నాయి. వైసీ పీ అధికారం చేపట్టిన ఈ నాలు గున్నరేళ్లలో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. నిధుల కొరతతో ఈ పథకం నిర్మాణం నిలిచిపోయింది. ఎత్తిపోతల పథకం పూర్తి చేసి ఉంటే ఖరీఫ్, రబీలో పంటలు పండేవి. వర్షాభావం, సాగు నీటి కరువుతో లక్షలాది ఎకరాలు బీళ్లుగా మారాయి. సాగర్ ఆయకట్టు వరప్రదాయనిగా ఉన్న పథకం పనులు చేపట్టక పోవడం జగన్‌కి తమపై ఉన్న ప్రేమను తెలియ జేస్తోందని రైతులు అంటున్నారు. సాగర్ కుడి కాల్వ ఆయకట్టుకు వరప్రదాయనిగా నిలిచే పథకంపై ప్రభుత్వం శీతకన్ను వేయడంపై రైతుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వం గోదావరి జలాలను తరలించేందుకు చేపట్టిన ఎత్తిపోతల పథకాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయకపోవడంపై రైతులు ఆగ్రహంగా ఉన్నారు. ఎత్తిపోతల పథకానికి వైఎస్ఆర్ కరువు నివారణ పథకంగా సీఎం జగన్ పేరు మార్చారు. అయితే పనులకు నిధుల విడుదలను విస్మరించారు. ఈ పథకం పూర్తయితే ఆయకట్టులో సాగు చిత్రం పూర్తిగా మారేది.

శాశ్వత పరిష్కారం.. పట్టించుకోలేదు

గుంటూరు, ప్రకాశం, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఖరీఫ్, రబీ సీజన్లలో తరచూ కరువు పరిస్థితులు నెలకుంటున్నాయి. వర్షాభావం, సాగు నీటి కరువు పరిస్థితుల్లో లక్షల ఎకరాలు బీళ్లుగా మారుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా గత టీడీపీ ప్రభుత్వం గోదావరి జలాల ఎత్తిపోతలను తెరపైకి తెచ్చింది. ఈ పథకం ద్వారా సాగర్ కుడి కాల్వకు గోదావరి జలాలను తీసుకొచ్చి సాగు, నీటి కష్టాలను తీర్చాలని ప్రణాళిక రూపొందించారు. గోదావరి జలాల తరలింపు పథకంతో ఆయా జిల్లాల్లోని సుమారు 10 లక్షల ఎకరాలకు గోదావరి జలాలు సరఫరా అవుతాయి. పట్టిసీమ పథకం ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు సరఫరా చేస్తుండటంతో ఆ ప్రాంతంలో రెండు పంటలు సాగు చేసుకునే అవకాశం ఏర్పడింది. ఇదే తరహాలో సాగర్ కుడి కాల్వ ఆయకట్టుకు కూడా గోదావరి జలాలతో మహర్దశ పట్టేది. ఇంతటి ప్రాధాన్యం కలిగిన పథకాన్ని ప్రభుత్వం అటకెక్కించడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు.


నరసరావుపేట ప్రాంతంలో బీళ్లుగా మారిన పొలాలు

ఎస్మా బేఖాతరు

- పట్టు వీడని అంగన్‌వాడీలు..
- చేతులకు సంకెళ్లతో ఆందోళనలు
- జిల్లా వ్యాప్తంగా ఉధృతంగా ఉద్యమం

బాపట్ల, జనవరి 9: ఎస్మా చట్టం పేరుతో ప్రభుత్వం బెదిరించినా అంగన్‌వాడీలు పట్టు వీడలేదు. విధుల్లో చేరే ప్రసక్తే లేదని మంగళవారం జిల్లావ్యాప్తంగా ఆందోళనలు కొనసాగించారు. ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్నా అదరక బెదరక నిరవధిక సమ్మెను కొనసాగిస్తున్నారు. కనీస వేతనం, గ్రాట్యుటీ ఇచ్చేదాకా నిరవధిక సమ్మెను విరమించేది లేదంటూ భీష్మించారు. సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ చేపట్టిన సమ్మె మంగళవారానికి 29 రోజులకు చేరింది. సమస్యలు తీరేదాకా సమ్మె నుంచి వెనక్కి తగ్గేది లేదని అంగన్‌వాడీలు ప్రకటించి ఆందోళనలను కొనసాగిస్తున్నారు. సమ్మె ప్రారంభం నాటి నుంచి అనేక ఆంక్షలను విధించిన ప్రభుత్వం చివరకు ఎస్మా చట్టాన్ని ప్రయోగించి నోటీసులు జారీ చేస్తున్నా అంగన్‌వాడీలు ఉద్యమాన్ని ఉధృతంగానే కొనసాగిస్తున్నారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా చేతులకు సంకెళ్లతో శిబిరాల వద్ద ధర్నాలు, నిరాహార దీక్షలు, ప్రదర్శనలు, మానవహారాలు, రాస్తారోకోలు, ధర్నాలతో హోరెత్తించారు. బాపట్ల ఉప్పరపాలెంరోడ్డు వద్ద రిలే నిరాహారదీక్షలో చేతులకు సంకెళ్లు వేసుకుని అంగన్‌వాడీలు వినూత్నంగా నిరసన తెలిపారు. ఓట్లు వేసి గెలిపించిన తమను పట్టించుకోని ఈ పాలకులు వద్దంటూ కొల్లూరులో అంగన్‌వాడీలు చేతులను నల్ల రిబ్బన్లతో కట్టుకుని నిరసన తెలిపారు. వేమూరు, భట్టిప్రోలులో తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. నోటీసులు వద్దంటూ అంగన్‌వాడీలు అమృతలూరులోని శ్రీప్రసన్నాంజనేయ స్వామి గుడి సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. రేపల్లెలో అంగన్‌వాడీలు చేతులకు సంకెళ్లతో ధర్నా చేశారు.


బాపట్లలో చేతులకు సంకెళ్ళు వేసుకొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


ఆకులు తింటూ బ్రతకాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

ఎన్నికలకు సన్నద్ధం కండి

- ఓటర్ల జాబితాలో ఫిర్యాదులు రాకూడదు
- కలెక్టర్, ఎస్పీలకు సీఈసీ బృందం ఆదేశాలు

గుంటూరు, బాపట్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్య కమిషనర్ రాజీవ్‌కుమార్ కలెక్టర్, ఎస్పీలను ఆదేశించారు. అధికార యంత్రాంగాన్ని ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు సీఈసీ కేంద్ర ఎన్నికల కమిషనర్లు, రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారితో కలిసి మంగళవారం విజయవాడలోని నోవాటెల్‌లో సమీక్ష నిర్వహించారు. సవరణ ప్రక్రియ మొదలైనప్పటి నుంచి డిసెంబరు 9 వరకు వచ్చిన అభ్యంతరాలు వాటి పరిష్కారం కోసం తీసుకున్న చర్యలపై కలెక్టర్లు సమ గ్రంగా సీఈవో బృందానికి వివరించి నట్లు సమాచారం. గుంటూరు జిల్లాలో ఎస్ఎస్ఆర్ కార్యకలాపాలు, ఎన్ని కల సన్నద్ధతపై కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సీఈసీకి నివేదించారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ ప్రక్రియ గురించి వివరిస్తూ ఈసీ ఆదేశాల మేరకు ప్రతీ వారం క్రమం తప్పకుండా గు ర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వ హించి అన్ని వివరాలను వారికి అందజేస్తున్నామన్నారు. ఈ సం దర్భంగా సీఈసీ మాట్లాడుతూ నిర్ణీత షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛీ కరించిన తుది ఓటర్ల జాబితాను ప్రచురించాలన్నారు. వాటిపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసు కోవాలని స్పష్టం చేశారు. ఈసీ మార్గదర్శకాల మేరకు అధికారుల బదిలీల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షకు గుంటూరు కలెక్టర్‌తో పాటు ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, పల్నాడు కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవి శంకర్ రెడ్డిలు హాజరయ్యారు. బాపట్ల కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ వివిధ అంశాలపై సీఈసీకి సమగ్ర నివేదిక ఇచ్చినట్లు సమాచారం.


సమావేశానికి హాజరైన ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు

ఫాం 7 దుర్వినియోగం పై ఆరా

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, ఎన్నికల సన్నద్ధత తదితర అం శాలపై సీఈసీ బృందం సమీక్షించింది. పర్చూరు లో వేల సంఖ్యలో ఫాం 7 దరఖాస్తుల దుర్వినియోగంపై చర్చించినట్లు సమాచారం. ఫాం7 దుర్వినియోగం చేసిన వారిపై కేసులు నమోదు చేసిన అంశాన్ని బాపట్ల కలెక్టర్, ఎస్పీలు సీఈసీ బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఫాం7 విషయంలో అవకతవక లకు పాల్పడిన వారిపై నమోదు చేసిన కేసుల విషయం లో తదుపరి పురోగతి ఏమిటన్న దానిపై కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. బృందం సమీక్షలో విపక్షాలు గతంలో ఇచ్చిన ఫిర్యా దులను దగ్గర పెట్టుకుని వాటిపై ఏం చర్యలు తీసుకున్నారో ఒకదాని వెంట ఒకటి అడిగినట్లు తెలుస్తోంది.

గుంటూరులో.. గుంటూరు కారం

గుంటూరు కారం సినీబృందం మంగళవారం గుంటూరు సమీపంలోని పెదకాకాని వద్ద సందడి చేసింది. నంబూరు రోడ్డు వద్ద సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ జరిగింది. పెద్దసంఖ్యలో అభిమానులు హాజరుకాగా హీరో మహేష్‌బాబు, హీరోయిన్లు శ్రీలీల, మీనాక్షిచౌదరి, నిర్మాత రాధాకృష్ణ(చిన్ని బాబు), దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌లతో పాటు దిల్‌రాజు ఇతర అగ్రశ్రేణి నటులంతా పాల్గొన్నారు.

- పెదకాకాని



దగ్గుబాటితో ఆమంచి

- వాడరేవులో ఇరువురూ భేటీ
- సాధారణ కలయిక అంటున్న అనుచరులు
- రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం

చీరాల, జనవరి 9: చీరాల మండలం వాడరేవులో డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావును వైసీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ మంగళవారం కలిశారు. వాడరేవులో డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావుకు చెందిన ఓ అతిథి గృహం నిర్మాణం జరుగుతోంది. ఆ పనులను పరిశీలించేందుకు డాక్టర్ దగ్గుబాటి రాగా విషయం తెలుసుకుని ఆమంచి ఆయన్ను కలిశారు. ఏకాంతంగా జరిగిన ఈ కలయిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. చీరాల, పర్చూరు నియోజకవర్గాలకు సంబంధించి రాజకీయంగా మొదటి నుంచి అవినాభావ సంబంధం ఉండటం అందుకు కారణం. అయితే డాక్టర్ దగ్గుబాటి, ఆమంచిలకు వ్యక్తిగతంగా, వ్యాపారపరంగా స్నేహ సంబంధాలు ఉన్నాయి. గతంలో రాజకీయంగా ఇద్దరి మధ్య సత్సంబంధాలు ఉన్నాయి. అయితే కొంతకాలంగా రాజకీయాలకు డాక్టర్ దగ్గుబాటి దూరంగా ఉంటున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే ఆమంచి వైసీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నా చీరాల నియోజక వర్గంలో కూడా తన ప్రత్యేక బాణీని చాటుకుంటూనే అడుగులు వేస్తున్నారు. ఆమంచి సోదరుడు, ఆమంచి స్వాములు(శ్రీనివాసరావు) జనసేనపార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, ఆ పార్టీ చీరాల నియోజకవర్గ బాధ్యుడిగా ఉన్నారు. ఆమంచి సోదరులు గతంలో రాజకీయంగా ఉమ్మడి ప్రయాణం చేశారు. అయితే కొంతకాలంగా వారి దారులు వేరయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా దగ్గుబాటి, ఆమంచి భేటీ రాజకీయ ప్రాధాన్యతను సంతరించు కుంది. అయితే వారి కలయిక ఎప్పటి మాదిరిగానే సర్వసాధారణమేనని వారి అనుచరులు చెప్తున్నారు. 216 జాతీయ రహదారి పక్కన ఆమంచికి సంబంధించి పాశ్చాత్య మోడల్‌లో ఓ నిర్మాణం జరుగుతోంది. ఈ క్రమంలో ఇరువురూ నిర్మాణాలకు సంబంధించి వారి మధ్య చర్చ జరిగి ఉంటుందని వారి సన్నిహితులు చెప్తున్నారు.



మందడం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న రైతులు

దోచుకోవటం తప్ప అభివృద్ధి లేదు

● పాలకుల సొంత ప్రయోజనాల కోసమే విశాఖకు రాజధాని

● 1484 వ రోజుకు రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, జనవరి 9: అంతటా దోచుకోవటం తప్పితే అభివృద్ధి ఎక్కడా కనిపించటం లేదని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలిచ్చిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు మంగళవారం నాటికి 1484వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి పలువురు మాట్లాడుతూ పాలకుల సొంత ప్రయోజనాల కోసమే రాజధాని విశాఖ అని పాట పాడుతున్నారన్నారు. అక్కడ జరిగిన వైసీపీ నేతల ఇన్‌సైడర్ ట్రేడింగ్‌ని బయటకు తీయాలన్నారు. అభివృద్ధి కోసం పరితపించే వారైతే ప్రత్యేక హోదా ఎందుకు తీసుకురాలేదన్నారు. దాన్ని వదిలేసి మూడు రాజధానులని మభ్య పెడుతున్నారన్నారు. ఇప్పటికైనా మూడుముక్కల ఆటను కట్టిపెట్టాలన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అమరావతి అభివృద్ధిని కొనసాగించాలన్నారు. రైతులకు కౌలు చెల్లించకుండా తమ జీవితాలను దెబ్బతీయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకులు ప్రజలకు మంచి చేయటం అంటే ఇదేనా.. అని ప్రశ్నించారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు కొనసాగుతున్నాయి.

436 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, జనవరి 9: స్థానిక పసుపుమార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన వేలంలో 436 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.8600 గరిష్ఠధర రూ.10,100 మోడల్‌ధర రూ.9,300 పలికాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.8600 గరిష్ఠధర రూ.9,750 మోడల్‌ధర రూ.9,200పలికాయి.

ఆగని శాంపిల్, మచ్చు కాయలు

● నిఘా బృందాలు ఏర్పాటు చేసి సీజ్ చేయాలని మార్కెటింగ్ జేడీ ఆదేశాలు

గుంటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో రైతులు తీసుకొచ్చిన మిర్చిటిక్కీలలో నుంచి శాంపిల్, మచ్చు కాయలు తీయడం ఆగడం లేదు. గత నెలలో ఛైర్మన్ రాజనారాయణ వద్ద జరిగిన చర్చల్లో ఇకపై మచ్చు, శాంపిల్ కాయలు తీయబోమని ఎగుమతిదారులు, దిగుమతిదారులు, వివిధ ముఠాకార్మికుల యూనియన్ల నాయకులు హామీ ఇచ్చి ఇప్పుడు సీజన్ ప్రారంభం కావడంతో మాట తప్పుతున్నారు. ఎగుమతిదారుల వద్ద పని చేసే గుమాస్తాలు ఒక్కో లాట్ నుంచి కనీసం రెండు నుంచి నాలుగు కేజీల వరకు మిరపకాయలను శాంపిల్ పేరుతో తీస్తున్నారు. వాటిని సెక్యూరిటీ సిబ్బంది కంటపడకుండా వాహనాల్లో పెట్టుకొని మిర్చియార్డు గేటు దాటిస్తూ బయట విక్రయించి లాభపడుతున్నారు. దీనిపై పాలకవర్గ సభ్యులు ఆరా తీయగా ఒక సీజన్‌లో కొంతమంది ఎక్స్‌పోర్టర్ల గుమాస్తాలు తీసే శాంపిల్ కాయలు విక్రయిస్తే ఒక లగ్జరీ కారునే కొనుగోలు చేయొచ్చని తెలియడంతో అంతా ఆశ్చర్యపోతున్నారు. మచ్చు, శాంపిల్ కాయలు తీయడం ఆగలేదని మార్కెటింగ్ జేడీ కాకుమాను శ్రీనివాసరావు దృష్టికి వెళ్లడంతో ఆయన మంగళవారం నుంచి యార్డులో ప్రతీ ఒక్క షెడ్డుకి మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్, డీఈవో, సెక్యూరిటీ గార్డు, పోలీసులతో నిఘా బృందాలను ఏర్పాటు చేశారు.



మిర్చియార్డులో అధికారులు సీజ్ చేసిన మచ్చు, శాంపిల్ మిరపకాయలు

ట్రేడింగ్ సమయంలో ఒక ధర... ఆ తర్వాత తగ్గింపు

రైతులు తీసుకొచ్చిన మిరపకాయలను కమీషన్ వ్యాపారస్థులు వారికి కేటాయించిన షెడ్డులలో ప్రదర్శనకు పెడతారు. వాటిని చూసే ఎక్స్‌పోర్టర్లు ఫలాన ధరకు కొనుగోలు చేస్తామని చెబుతారు. అందుకు రైతు అంగీకరిస్తే ట్రేడింగ్ ముగుస్తుంది. అయితే ఆ తర్వాత ఎగుమతిదారుల గుమాస్తాలు వచ్చి లాట్‌ల నుంచి శాంపిల్స్ తీస్తున్నారు. సరుకు నాణ్యత లేదని ధర తగ్గిస్తున్నారు. లేకుంటే తమకు అవసరం లేదని చెబుతున్నారు. దాంతో రైతులు మరుసటి రోజు వరకు వేచి ఉండలేక ఇష్టం లేకపోయినా తక్కువ నగదుని తీసుకొని వెళుతున్నారు. వీటిపై ఫిర్యాదులు రావడంతో మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు మంగళవారం ఏడీ మార్కెటింగ్ రాజబాబు, ఇతర సిబ్బందితో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీగా మచ్చు, శాంపిల్ కాయలు తీసుకెళుతున్న వారి వద్ద వాటిని సీజ్ చేశారు.

ప్రజల ఆర్థిక, సామాజిక అభివృద్ధే లక్ష్యం

● జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా

గుంటూరు సిటీ, జనవరి 9: అన్ని వర్గాల ప్రజల ఆర్థిక, సామాజిక అభివృద్ధే లక్ష్యం గా గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు (జీపీడీపీ) ఉండాలని జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అన్నారు. గ్రామ, మండల, జిల్లా అభివృద్ధి ప్రణాళికలను 2024-25 సంవత్సరం తయారు చేయడానికిగాను రెండు రోజుల శిక్షణా కార్యక్రమం మంగళవారం ఆరంభమైంది. జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీ ఛైర్‌పర్సన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. రాజ్యాంగంలోని 243జి ఆర్టికల్ ప్రకారం స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు కల్పించిన ఉద్దేశాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. జడ్పీ సీఈవో మోహనరావు మాట్లాడుతూ ప్రజా ప్రణాళిక ఉద్యమం ద్వారా అన్ని శాఖల సహకారంతో అన్ని అంశాలకు ప్రాధాన్యత ఇచ్చి పంచాయతీరాజ్ సంస్థలలో ప్రణాళికలు పూర్తి చేయవలసినదిగా అధికారులను కోరారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారులు కె.శ్రీదేవి, భాస్కర్‌రెడ్డి, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు. శిక్షణ ఏర్పాట్లను జడ్పీ అకౌంట్స్ అధికారి జి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



మాట్లాడుతున్న జడ్పీ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, సీఈఓ మోహనరావు

రైతుల అవసరాలే ప్రాధాన్యం

● వీసీ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి

లాంఫాం(తాడికొండ), జనవరి 9: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతుల అవసరాలే ప్రాధాన్యంగా పనిచేస్తుందని వీసీ డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీదేవి పేర్కొన్నారు. మంగళవారం లాంఫాంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో రెండురోజుల పాటు జరగనున్న 53వ పరిశోధనా, విస్తరణ సలహా మండలి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా వివిధ వాతావరణ పరిస్థితులు, ప్రధానమైన పురుగులు, తెగుళ్ల తట్టుకునేలా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారన్నారు. 2022 సంవత్సరంలో అధిక దిగుబడి నిచ్చే 15 నూతన వంగడాలు, 2023లో 19 నూతన వంగడాలను రాష్ట్ర, జాతీయస్థాయిలో విడుదల చేశారన్నారు. వ్యవసాయ రంగంలో ఎప్పటికప్పుడు వచ్చే సమస్యలు గుర్తిస్తూ తగు పరిష్కారాలు ఇవ్వటం జరుగుతోందన్నారు. అగ్రిమిషన్ వైస్‌ఛైర్మన్ డాక్టర్ ఎంవీఎస్ నాగిరెడ్డి మాట్లాడుతూ ఆహార భద్రత దిశగా రసాయన ఎరువులను ఉపయోగించి దాదాపు మూడు రెట్లు దిగుబడి స్థాయిని పెంచాంగానీ రైతు నికర లాభం తగ్గిందన్నారు. వరిలో ఆహార సమృద్ధిని సాధించాం కానీ, ఇప్పటికీ నూనెగింజలు, అపరాలలో సమృద్ధి సాధించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉత్తమ ప్రాంతీయ పరిశోధనా స్థానాలుగా తిరుపతి, లాంఫాంలు మొదటి, రెండు స్థానాల్లో నిలిచాయి. ఉత్తమ వ్యవసాయ పరిశోధన స్థానాలుగా ఏఆర్ఎస్ నెల్లూరు, ఏఆర్ఎస్ విజయనగరంలు ఎన్నికయ్యాయి. ఉత్తమ కృషి విజ్ఞానకేంద్రాలుగా కేవీకే రస్తకుంటుబాయి, దర్శిలను ఎంపిక చేశారు. ఉత్తమ ఏరువాక కేంద్రాలుగా విజయనగరం, చిత్తూరులను గుర్తించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ అడ్వైజర్ బత్తుల బ్రహ్మానందరెడ్డి, పాలవర్గసభ్యులు కోదండరామిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సాయిలక్ష్మీ, కోటేశ్వరమ్మ, చింత ఈశ్వరరావు, మురళీధరరెడ్డి, డాక్టర్ ఎం.ఎస్.చైతన్యకుమారి, డాక్టర్ గురుమూర్తి, డాక్టర్ వీ రాఘవరెడ్డి, డాక్టర్ ఏ.విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పరిశోధన ప్రతులను ఆవిష్కరిస్తున్న వీసీ, అగ్రిమిషన్ వైస్ ఛైర్మన్

అట్టహాసంగా ప్రారంభమైన ఎంపీఎల్-2

● తొలిరోజు సందడిగా క్రికెట్ లీగ్ పోటీలు ● హాజరైన తెనాలి శ్రావణ్‌కుమార్, ఎంఎస్ రాజు

మంగళగిరి సిటీ, జనవరి 9: మంగళగిరిలో ఎంపీఎల్-2 క్రికెట్ టోర్నీ మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదినోత్సవం సందర్భంగా ఈ నెల 9 నుంచి 28వ తేదీ వరకు క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నారు. పట్టణంలోని జాతీయరహదారి వెంబడి నారా లోకేశ్ క్రీడాప్రాంగణం(బోగి ఎస్టేట్స్)లో లీగ్ దశ పోటీలను టీడీపీ గుంటూరు పార్లమెంటు అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి నసీర్‌అహ్మద్, ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు ప్రారంభించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం యువతను క్రీడల వైపు ప్రోత్సహించకుండా మత్తు పదార్థాలకు బానిసలుగా మారుస్తున్నదని ధ్వజమెత్తారు. నసీర్‌అహ్మద్ మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో యువతను క్రీడల వైపు ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో క్రీడామైదానాలను ఏర్పాటు చేసి అనేక క్రికెట్, వాలీబాల్ టోర్నీలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఎంఎస్ రాజు మాట్లాడుతూ యువతలో క్రీడానైపుణ్యాలను వెలికితీసేందుకు ఎంపీఎల్ నిర్వహించడం అభినందనీయమన్నారు. వైసీపీ ప్రభుత్వం క్రీడా మైదానాలను ప్రైవేటువ్యక్తుల పరం చేస్తుంటే.. మంగళగిరిలో లోకేశ్ ప్రైవేటు వ్యక్తులను సమన్వయపరిచి క్రీడామైదానాలను ఏర్పాటుచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, మండల అధ్యక్షుడు తోట పార్థసారధి, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు, దుగ్గిరాల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, నియోజకవర్గ టీడీపీ, జనసేన నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శ్రావణ్‌కుమార్, ఎంఎస్ రాజు తదితరులు

బైజూస్ ఒప్పందాన్ని ప్రభుత్వం రద్దు చేసుకోవాలి

● బైజూస్ కార్యాలయం ఎదుట యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నేతల నిరసన ధర్నా

● నాయకులు స్టేషన్‌కు తరలింపు.. విడుదల

గుంటూరు, జనవరి 9: బైజూస్ కంటెంట్ పేరుతో పేద విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.లక్షలు వసూలు చేస్తున్న ఆ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాన్ని రద్దుచేసుకోవాలని యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. అరండల్‌పేటలోనున్న బైజూస్ కార్యాలయం ఎదుట యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నేతలు నూనె పవన్‌తేజ, చార్లెస్ ప్రదీప్, షేక్ మహమూద్, తిరుమలరావు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్‌కరీం పలువురు నాయకులు బైఠాయించి నిరసన ధర్నాచేశారు. ఈ సందర్భంగా యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె పవన్‌తేజ మాట్లాడుతూ బైజూస్‌తో రూ.3500కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని రద్దుచేసుకోవాలని డిమాండ్ చేశారు. మనీ లాండరింగ్ కేసులు, ఈడీ కేసులు ఎదుర్కొంటున్న బైజూస్‌కి ఇంత పెద్దమొత్తంలో కాంట్రాక్టుని అప్పగించటం అంటే ప్రభుత్వంలో జరిగే అవినీతిలో భాగంగానే ఈ ఒప్పందం జరిగిందనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ఒప్పందాన్ని రద్దుచేసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరీం మాట్లాడుతూ దివాళాకు సిద్ధంగా ఉన్న బైజూస్‌ను కాపాడేందుకు సీఎం జగన్ తాపత్రయపడుతున్నారు తప్ప, విద్యార్థులకోసం కాదన్నారు. ధర్నాచేస్తున్న నాయకులను పోలీసులు అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించి అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.



బైజూస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు

కంపెనీ సెక్రటరీ కోర్సుతో మెరుగైన అవకాశాలు

గుంటూరు(తూర్పు), జనవరి 9: కంపెనీ సెక్రటరీ కోర్సుతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ది ఇన్‌స్టిట్యూట్ కంపెనీ సెక్రటరీ అమరావతి చాప్టర్ ఛైర్మన్ సోము శివరామకృష్ణ తెలిపారు మంగళవారం అరండల్‌పేటలో ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో, ది ఇన్‌స్టిట్యూట్ చాప్టర్, ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ ఎకౌంటెంట్స్ ఆఫ్ రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీ ఇండియా (ఐసీపీఎస్) సంయుక్త ఆధ్వర్యంలో కార్పొరేట్ టాక్సేసన్, ఎంఎస్ఎంఇ డైనమిక్స్, లేటెస్ట్ అమెండెమెంట్స్ ఇన్ కంపెనీస్ యాక్ట్, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ, జాతీయ అధ్యక్షుడు సీఎస్ మనీషాగుప్తా మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో నిలదొక్కుకోవాలంటే కంపెనీ సెక్రటరీ కోర్సు ఎంచుకోవాలన్నారు.

గ్రామస్థాయి నాయకులపై బైండోవర్ కేసులు

8 గ్రామాలు.. 227మంది బైండోవర్

యడ్లపాడు, జనవరి 9: ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడంతోపాటు అల్లర్లకు పాల్పడేవారిని, పాత కేసులు ఉన్నవారిని పోలీసులు గుర్తించి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారు. మండలంలో 22 గ్రామాలు ఉండగా సోమవారం 5 గ్రామాలలోని ఇరు పార్టీలకు చెందిన 156మందిపై, మంగళవారం 2 గ్రామాల్లోని 71 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. టీడీపీ, వైసీపీ నాయకులపై నమోదైన బైండోవర్ కేసుల వివరాలు గ్రామాల వారీగా.. మైదవోలులో టీడీపీ 21, వైసీపీ 21, కారుచోల టీడీపీ 15, వైసీపీ 15, గుత్తావారిపాలెం టీడీపీ 4, వైసీపీ 4, సొలస టీడీపీ 7, వైసీపీ(భాస్కర్‌రెడ్డి వర్గం) 7, వైసీపీ(బీవీ రెడ్డి వర్గం) 7, ఉన్నవ టీడీపీ 16, వైసీపీ 15, పుట్టకోట టీడీపీ 12, వైసీపీ 12, చెంఘీజ్‌ఖాన్‌పేట టీడీపీ 10, వైసీపీ 10, యడ్లపాడు టీడీపీ 26, వైసీపీ 25మందిపై బైండోవర్ కేసులు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 76,495 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 73,895 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. యార్డు ఆవరణలో 40,355 టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఇలా నమోదయ్యాయి..

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	21000
నెంబరు. 5	12000	19000
273	10000	17000
341	9000	19500
4884	11000	17500
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	22000
బ్యాడిగి	9000	21000
దేవనూరుడీలక్స్	10000	19000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
తెల్లకాయలు	5000	13000
ఏసీ కామన్ వెరైటీ		
334	14000	20000
నెంబరు. 5	11000	11000
273	--	--
341	10000	16500
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9500	22000
బ్యాడిగి	11000	19000
దేవనూరుడీలక్స్	--	--
తెల్లకాయలు	6000	11000



జయహో బీసీ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ, డాక్టర్ చదలవాడ, డాక్టర్ కడియాల తదితరులు

175 నియోజకవర్గాలు.. 962 మండలాల్లో

జయహో బీసీ సదస్సులు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

నరసరావుపేట టౌన్, జనవరి 9: రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో, 962 మండలాలలో జయహో బీసీ సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర పార్టీ నిర్ణయించిందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు అన్నారు. మంగళవారం నరసరావుపేట టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. జయహో బీసీ పుస్తకాలను ఆవిష్కరించి, అనంతరం బీసీ రథాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ 40 రోజులపాటు ఈ సదస్సులు రాష్ట్ర వ్యాప్తంగా జరుపుతామన్నారు. ఈ సదస్సుల ద్వారా గత నాలుగున్నరేళ్లుగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో బీసీలకు జరిగిన అన్యాయం గురించి ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 74మంది బీసీలను హత్యలు చేశారని, 5వేల మందికి పైగా బీసీలపై తప్పుడు కేసులు పెట్టి వేధించారన్నారు. బీసీ సబ్‌ప్లాన్ నిధులు రూ.75,760కోట్లు దారిమళ్లించారన్నారు. చంద్రబాబునాయుడు స్థానిక సంస్థలలో బీసీలకు రిజర్వేషన్ 34శాతానికి పెంచారన్నారు. వైసీపీ ప్రభుత్వం దానిని 24శాతానికి తగ్గించిందన్నారు. 30 బీసీ సంక్షేమ పథకాలు జగన్‌రెడ్డి రద్దు చేశారన్నారు. 13 బీసీ భవనాలు, 1187 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం ఆపేశారన్నారు. పేరుకు 56 కార్పొరేషన్‌లు పెట్టి ఏ ఒక్కదానికీ కూర్చోడానికి కుర్చీలు, ఒక్క రుణం ఇవ్వలేదన్నారు. నామినేటెడ్ పదవులు 90శాతం సొంతవర్గానికి, కులానికే ఇచ్చారన్నారు. ప్రభుత్వ సలహాదారుల్లో ఒక్కరైనా బీసీలున్నారా అని ప్రశ్నించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ పల్నాడులో 26మంది బీసీలను వైసీపీ గుండాలు హత్య చేశారన్నారు. 360మంది మీద అక్రమ కేసులు, గంజాయి కేసులు పెట్టారన్నారు. సమావేశంలో గుంటుపల్లి నాగేశ్వరరావు, జిల్లా నాయుడు రాంబాబు, మాజీ ఎంపీపీ కడియం కోటిసుబ్బారావు, డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్ళించిన జగన్

పెదకూరపాడు, జనవరి 9: బీసీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్ళించిన బీసీల ద్రోహి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. మంగళవారం గుంటూరులోని పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో బీసీ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో త్వరలో జరగబోయే జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా నాలుగు సంవత్సరాల పాలనలో బీసీలను రాజకీయంగా, ఆర్థికంగా కుంగదీశారన్నారు. బీసీల సంక్షేమ పథకాలను రద్దుచేసి రూ.75వేల కోట్ల బీసీ నిధులను దారి మళ్ళించారని మండిపడ్డారు. మరోసారి మోసం చేసేందుకు వైసీపీ బీసీ మంత్రులు, నేతలతో జగన్ సమావేశం నిర్వహించి వారితో అబద్ధపు ప్రకటనలు చేయించారని తెలిపారు. స్థానిక సంస్థల్లో పది శాతం రిజర్వేషన్‌లు తగ్గించి రాజ్యాంగబద్ధ పదవులను బీసీలకు దూరం చేశారని, బీసీల అసైన్డ్ భూములు 8వేల ఎకరాలు బలవంతంగా స్వాధీనం చేసుకున్నారన్నారు. విదేశీ విద్య, పెళ్ళి కానుకలు, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ రద్దు చేయటం, 13 బీసీ భవనాలను, 1187 బీసీ కమ్యూనిటీ భవనాలను నిలిపివేసిన ద్రోహి జగన్ అన్నారు. బీసీ సాధికారితను, ఆదరణ పథకాన్ని మంట గలిపారన్నారు. జీవో నెం.217తో మత్స్యకారుల వృత్తికి ఉరితాడు బిగించారని, పేరుకు మాత్రమే 56 కార్పొరేషన్‌లు పెట్టి వాటికి నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అర్తిమళ్ళ రమేష్, నల్లమేకల వెంకటేశ్వర్లు, నందిగామ ఆశీర్వాదం, మద్దిరాల గంగాధర్, గుడిపాడు బాషా, నల్లమేకల లక్ష్మీనారాయణ, గాదె సూర్యనారాయణ, మోదుగుల చంద్రశేఖర్, ఓర్సు ఆనంద్, బలుసుపాడు చిరంజీవి, పోకా వెంకటరావు, బత్తుల శ్రీను, వల్లాల వెంకటేశ్వరరావు, దూళ్ళ సాంబశివరావు, కోరంపల్లి నరేంద్రబాబు, శివరాత్రి పెద శ్రీను, పి.రామయ్య, ఆల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.65 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	90, 99, 108
చికెన్ విత్ స్కిన్	174.00
చికెన్ స్కిన్ లెస్	184.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు


పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు

అమృతలూరు, జనవరి 9 : మండల పరిధిలోని కూచిపూడి, అమృతలూరు గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. అమృతలూరుకు చెందిన కొలకలూరి మధుబాబు ఆధ్వర్యంలో ఆయా గ్రామాలకు చెందిన 30 కుటుంబాలు వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు వీరికి తన క్యాంపు కార్యాలయంలో పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో క్రొత్తపల్లి రవీంద్రబాబు, గొట్టిపాటి గంగాధర్, శరణు శేషగిరి, వీరగంధం శ్రీనివాసరావు, బొల్లు రామేశం తదితరులు పాల్గొన్నారు.

ఏపీ భూహక్కు చట్టం తక్షణమే రద్దు చేయాలి

బాపట్ల, జనవరి 9 : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఏపీ భూహక్కుల చట్టంను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ బాపట్ల బార్ అసోసియేషన్ న్యాయవాదులు స్థానిక కోర్టు ప్రాంగణంలో బార్‌ఫెడరేషన్ పిలుపు మేరకు నినాదాలు చేశారు. బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు బీమా లీలా కృష్ణ మాట్లాడుతూ ఏపీ భూహక్కుల చట్టానికి వ్యతిరేకంగా బాపట్లలో రిలేదీక్షలు చేపట్టేందుకు సిద్దంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పులిపాక రఘురాం, నల్లమోతు సుబ్బారావు, నందనవనం ప్రసాదరావు, దుద్దుకూరి భాస్కర్, విన్నకోట సత్యప్రసాద్, జెడ్.బాషా, సతీష్‌రాజా, డి.ఫిలీఫ్, కిషోర్, సి.ప్రేమచంద్, ఎ.ప్రతాప్, ఎల్.శ్రీనివాసరావు, స్టాలిన్, విమల్‌కుమార్, కోర్నేలు, బి.కమల్‌కుమార్, జనరల్ సెక్రటరి ఇమ్మడిశెట్టి బాలకృష్ణ, మహిళా న్యాయవాదులు ఉషారాణి, నాగమోహిని, దివ్య, నాగలక్ష్మీ, జూనియర్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : ఏఐటీయూసీ


నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

బాపట్ల, జనవరి 9 : పారిశుధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటిదాసు డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికులు, నాయకులతో కలిసి బాపట్ల మున్సిపల్ కార్యాలయం ఎదుటనిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం బాపట్ల పాతబస్టాండ్ ఆవరణలో ర్యాలీ, మానవహారంగా ఏర్పడి మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ప్రధాన సమస్యలు కోరుతూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జెబి.శ్రీధర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి దళాయి సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అద్దంకి నాగేశ్వరరావు, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

5కే రన్ విజేతలకు బహుమతులు అందజేత

పిట్టలవానిపాలెం, జనవరి 9 : సంపూర్ణ ఆరోగ్యవంతమైన జనజీవనానికి, వ్యక్తిత్వ వికాసానికి, విద్యాభివృద్ధికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని బాపట్ల పంచాయతీరాజ్ అధికారి జె.హరిరామకృష్ణ అన్నారు. మండలంలోని ఖాజీపాలెం కేవీఆర్ కేవీఆర్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర స్థాయి పురుషుల 5కె రన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో హైదరాబాద్‌కు చెందిన సాయి అకాడమిక్ చెందిన మోహిత్‌చౌదరి(ప్రథమ), చల్లా రమేష్ (ద్వితీయ) స్థానాలు కైవశం చేసుకున్నారు. కాకినాడకు చెందిన ఎన్.హరీష్ (తృతీయ) స్థానం సాధించారు. తొలి మూడు స్థానాలు కైవశం చేసుకున్నవారికి రూ.10,000, రూ.5000, రూ.3000లు చొప్పున నగదు బహుమతులతోపాటు ధ్రువీకరణపత్రాలను ముఖ్యఅతిధిలుగా పాల్గొన్న హరిరామకృష్ణ, కళాశాల పాలకవర్గంఅధ్యక్షులు డాక్టర్ మంతెన నరసరాజు, కళాశాల కార్యదర్శి కరస్పాండెంట్ మంతెన శ్రీనివాస్‌కుమార్, కళాశాల ఉపాధ్యక్షులు మంతెన శివరామరాజులచేతమీదగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఒంగోలుకు చెందిన సిహెచ్ వెంకటేశ్వరరావు, యుఎస్‌లో ఉన్న మంతెన నాగరాజుల సౌజన్యంతో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శివప్రసాద్, ఓఎస్‌డి మంతెన కృష్ణంరాజు, పీడీ రామకృష్ణారెడ్డి, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేతులకు సంకెళ్ళతో అంగన్‌వాడీల వినూత్న నిరసన


రేపల్లెలో చేతికి సంకెళ్ళు కట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

బాపట, జనవరి 9 : సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ చేపట్టిన సమ్మెలో భాగంగా మంగళవారం బాపట్ల ఉప్పరపాలెం రోడ్డు వద్ద రిలే నిరాహారదీక్షలో అంగన్‌వాడీలు చేతులకు సంకెళ్ళు వేసుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ తమకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

● బాపట్లరూరల్, జనవరి 9 : అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రభుత్వం ఉపసంహరించాలని జనవిజ్ఞానవేదిక రాష్ట్ర నాయకుడు కోట వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. బాపట్లలో రిలేనిరాహార దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలకు జనవిజ్ఞానవేదిక రాష్ట్రనాయకులు కోట వెంకటేశ్వర్లురెడ్డి మంగళవారం సంఘీభావాన్ని తెలిపారు.

● భట్టిప్రోలు, జనవరి 9 : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న నిరవధిక సమ్మె మంగళశారం 29వ రోజుకు చేరింది. సమ్మె శిబిరం వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి స్థానిక పంచాయతీ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్దకు వచ్చి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రమాదేవి, సూర్యలక్ష్మీ, గృహలక్ష్మీ, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు పి.మనోజ్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు మురుగుడు సత్యనారాయణ, సెక్టార్ లీడర్లు చెల్లమ్మ, వాణి, రత్నకుమారి, మమత, దివ్య, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

● కొల్లూరు, జనవరి 9 : మండల కేంద్రం కొల్లూరులో అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె మంగళవారం 29వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఈ చేతులతో ఓట్లు వేసి గెలిపించిన తమను పట్టించుకోని ప్రభుత్వాన్ని ఈ పాలన మాకు వద్దంటూ చేతులను నల్ల రిబ్బన్లతో కట్టుకుని నిరసన తెలిపారు. సిఐటియు నాయకులు బి.అగస్టీన్, సుబ్బారావు, సెక్టార్ లీడర్ పద్మ, కాశీ, బాల, ఆదిలక్ష్మి, వనజ, భాగ్యం, సౌభాగ్యలక్ష్మి, అపర్ణ, అరుణ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

● వేమూరు, జనవరి 9 : వేమూరులో ప్రారంభించిన అంగన్‌వాడీల నిరవధిక సమ్మె మంగళవారం 29వ రోజుకు చేరుకుంది. 17గ్రామాలకు చెందిన అంగన్‌వాడీలు ఫ్లెక్సీలు, ప్లే కార్డులు చేతపట్టి వీధుల్లో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమోహన్, సిఐటియు నాయకులు అగస్టిన్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పద్మావతి, అన్నపూర్ణ, అమల, దుర్గా భార్గవి పాల్గొన్నారు.

● రేపల్లె, జనవరి 9: స్థానిక తహసీల్దార్ కార్యాలయం గేటు వద్ద అంగన్‌వాడీలు, ఏఐటియూసీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మె 29వరోజుకు చేరుకుంది. అంగన్‌వాడీలు చేతికి సంకెళ్ళు కట్టుకుని నిరసన తెలిపారు. ఏఐటీయూసీ రేపల్లె ఏరియా గౌరవాధ్యక్షుడు గొట్టుముక్కల బాలాజీ మాట్లాడుతూ బుధవారం నుంచి ఉద్య మాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ముబీనా, మొజశ్రీ, నాంచారమ్మ, నసీమున్నీసా, ధనలక్ష్మీ,అరుణకుమారి,వై.కనకదుర్గ, దుర్గాభవాని, శ్రీలేఖ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు చేస్తున్న నిరవధిక సమ్మె 29వ రోజుకు చేరింది. అంగన్‌వాడీలు ఆకులు తింటూ నిరసన తెలిపారు. అంగన్‌వాడీల వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియూ రేపల్లె ప్రాజెక్టు సీనియర్ నాయకులు డి.జయప్రద, సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్, కేవీ లక్ష్మణ్‌రావు, బేబి రాణి, రజని, నాగమణి పాల్గొన్నారు.

బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్‌కు ఉత్తమ అధ్యాపక అవార్డు

బాపట్లటౌన్, జనవరి 9 : రాజమండ్రిలో ఈనెల 6, 7 తేదీలలో నిర్వహించిన నేషనల్ కాన్ఫరెన్స్‌లో అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ టీచర్స్ ఇన్ ఇండియా (ఏపీటీఐ), రాష్ట్రం తరుపున ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తి మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు, ఏపీ స్టేట్ బ్రాంచ్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు చేతుల మీదగా ఈ అవార్డును అందుకున్నట్లు తెలిపారు. ఫార్మాలో మరింత పరిశోధన చేసి విద్యార్థులకు ఉత్తమ ప్రయోగాలను అందజేయనున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తిని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు దొప్పలపూడి రామ్మోహనరావు, గెల్లి దిలీప్, జాయింట్ సెక్రటరి, కొమ్మినేని హరిపద్మ ప్రసాద్, ట్రెజరర్, తాళ్ళూరి రామకృష్ణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

బెల్లంఊట ధ్వంసం, మద్యం స్వాధీనం

బాపట్ల, జనవరి 9 : సెబ్‌సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం స్టూవర్టుపురంలో నాటుసారా తయారీ స్థావరంపై దాడి నిర్వహించి 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అదేవిధంగా కొండుభొట్లవారిపాలెం గ్రామంలో సి.సురేష్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి దాడి చేసి 10 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సెబ్ సీఐ తెలిపారు.

ఆడుదాం ఆంధ్ర పోటీలు అన్ని మండలాలలో ప్రారంభించాలి

బాపట్ల, జనవరి 9 : ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు బుధవారం ఉదయం అధికారులు అన్ని మండలాలలో ప్రారంభించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వాహణపై జిల్లా, మండల స్థాయి అధికారులతో మంగళవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 18న జిల్లా స్థాయి కార్యక్రమం బాపట్లలో జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా మానవహారం, ఫోటోఎగ్జిబిషన్ వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా సాంఘిక సాధికారిత అధికారిణి జె.రాజాదేబోరా, డ్వామా పీడీ బి.అర్జునరావు, డీఆర్‌డీఏ పీడీ సీహెచ్ కృష్ణ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే అనగాని జన్మదినోత్సవానికి భారీ ఏర్పాట్లు


అభిమానులు ఏర్పాటు చేసిన కటౌట్

రేపల్లె, జనవరి 9 : ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ పుట్టినరోజు పురస్కరించుకుని పట్టణం లో భారీ కటౌట్‌లను ఏర్పాటు చేశారు. భారీ ఫ్లెక్సీలు, విద్యుత్ బోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ బుధవారం ఉప్పూడిరోడ్డులోని పార్టీకార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు. నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే జన్మదిన శుభాకాంక్షలకు తెలియజేసేందుకు భారీగా తరలి వస్తారనే అంచనా వేసి 25 వేల మందికి ఉప్పూ డిరోడ్డులోని సత్యసాయి స్కూల్ గ్రౌండ్‌లో భోజనాలను ఏర్పాటు చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలువురు మాజీ మం త్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రానున్నట్లు టీడీపీ శ్రేణులు తెలుపుతున్నారు.

దిక్సూచి DIKSUCHI

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో డిస్టెన్స్ డిప్లొమాలు



యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యూఓహెచ్) ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్(సీడీవీఎల్) - డిప్లొమా, అప్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని డిస్టెన్స్, ఆన్‌లైన్ మోడ్‌లలో నిర్వహిస్తారు. ఒక్కో ప్రోగ్రామ్‌లో కనిష్ఠంగా 50 సీట్లు ఉంటాయి. అకడమిక్ ప్రతిభ, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

డిప్లొమా ప్రోగ్రామ్‌లు

- డిప్లొమా ఇన్ లైబ్రరీ ఆటోమేషన్ అండ్ నెట్‌వర్కింగ్
- డిప్లొమా ఇన్ సైబర్ లాస్ అండ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్
- డిప్లొమా ఇన్ కమ్యూనికేటివ్ ఇంగ్లీష్
- డిప్లొమా ఇన్ క్రిమినల్ జస్టిస్ అండ్ ఫోరెన్సిక్ సైన్స్
- డిప్లొమా ఇన్ బిజినెస్ మేనేజ్‌మెంట్
- డిప్లొమా ఇన్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్
- డిప్లొమా ఇన్ పంచాయతీ రాజ్ గవర్నెన్స్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్
- డిప్లొమా ఇన్ ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్
- డిప్లొమా ఇన్ కమ్యూనిటీ ఐ హెల్త్
- డిప్లొమా ఇన్ టెలికాం టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్

అప్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌లు

- డిప్లొమా ఇన్ గవర్నెన్స్
- డిప్లొమా ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్
- డిప్లొమా ఇన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్
- సర్టిఫికెట్ కోర్స్ ఇన్ బర్త్ కేర్ ప్రాక్టీషనర్

ప్రోగ్రామ్‌ల వివరాలు: ఒక్కో డిప్లొమా ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. గరిష్ఠంగా మూడేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. ఒక్కో ప్రోగ్రామ్‌లో రెండు టర్మ్‌లు ఉంటాయి. ప్రతి టర్మ్‌లో అయిదు నుంచి పది రోజులపాటు కాంటాక్ట్ క్లాసెస్ నిర్వహిస్తారు. వీటికోసం అభ్యర్థులు యూనివర్సిటీ క్యాంపస్‌లకు హాజరు కావచ్చు. లేదంటే ఆన్‌లైన్ ద్వారా వినవచ్చు. ప్రాక్టికల్ సెషన్స్ కూడా ఉంటాయి. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ప్రతి ప్రోగ్రామ్‌లో స్టడీ సెమినార్‌లు, కౌన్సెలింగ్ సెషన్స్, ఇంటర్నల్ అసెస్‌మెంట్‌లు, అసైన్‌మెంట్‌లు, ప్రాజెక్ట్ వర్క్‌లు, టర్మ్ ఎండ్ ఎగ్జామినేషన్‌లు ఉంటాయి.

- సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ బర్త్ కేర్ ప్రాక్టీషనర్ వ్యవధి ఆర్నెల్లు.
- **దరఖాస్తు ఫీజు:** రూ.300
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** cdvl.uohyd.ac.in

పీజీ డిప్లొమా ఇన్ బిజినెస్ అనలిటిక్స్

ఖరగ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ కేజీపీ), కోల్‌కతాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎంసీ), ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్(ఐఎస్ఐ) ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బిజినెస్ అనలిటిక్స్(పీజీడీబీఏ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. ఇది రెండేళ్ల ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ముందుగా కోల్‌కతా ఐఐఎంలో ఓరియంటేషన్ ప్రోగ్రామ్, ప్రీ సెమిస్టర్ మాడ్యూల్ నిర్వహిస్తారు. ఐఎస్ఐలో మొదటి సెమిస్టర్, ఐఐటీ కేజీపీలో రెండో సెమిస్టర్, ఐఐఎం కోల్‌కతాలో మూడో సెమిస్టర్ చదవాల్సి ఉంటుంది. నాలుగో సెమిస్టర్‌లో ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 65 సీట్లు ఉన్నాయి. అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్‌లను అనుమతిస్తారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ సౌకర్యం ఉంది.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ/ఎంకాం ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంజనీరింగ్ డిప్లొమా తరవాత లేటరల్ ఎంట్రీ ద్వారా మూడేళ్ల ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తిచేసినవారు; నాలుగేళ్ల బీఎస్సీ ఉత్తీర్ణులు; సీఏ/సీఎస్/ఐసీడబ్ల్యూఏఐ పూర్తిచేసినవారు; ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు అప్లయ్ చేసుకోవచ్చు.

అడ్మిషన్ టెస్ట్ వివరాలు: దీనిని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. వెర్బల్ ఎబిలిటీ నుంచి 15, లాజికల్ రీజనింగ్ నుంచి 5, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ డేటా విజువలైజేషన్ నుంచి 5, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 25 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు నిర్దేశించారు. మొత్తం మార్కులు 150. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ఎంపిక: అడ్మిషన్ టెస్ట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థులను ఇంటర్వ్యూకి పిలుస్తారు. అడ్మిషన్ టెస్ట్ స్కోర్‌కు 45 శాతం, ఇంటర్వ్యూలో వచ్చిన మార్కులకు 40 శాతం, ఇంటర్/డిప్లొమా స్థాయి మార్కులకు 8 శాతం, అనుభవానికి 7 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.25 లక్షలు(ట్యూషన్ ఫీజు+క్యాంపస్ లాడ్జింగ్+బుక్స్+స్టడీ మెటీరియల్+ఎగ్జామినేషన్ మెటీరియల్స్+ల్యాబొరేటరీ ఛార్జీలు)
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 6
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం
- **కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ తేదీ:** మార్చి 17
- **వెబ్‌సైట్:** isical.ac.in, iitkgp.ac.in, iimcal.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/5ysEkHmలో చదవండి.

రిమైండర్

ఏపీపీఎస్సీ నోటిఫికేషన్స్

గ్రూప్-1 సర్వీస్ పోస్టులు

ఖాళీలు 81

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) నోటిఫికేషన్ దరఖాస్తులు స్వీకరిస్తోంది.

శాఖల వారీ ఖాళీలు

1. డిప్యూటీ కలెక్టర్(ఏపీ సివిల్ సర్వీస్- ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్): **9 పోస్టులు**
2. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్(ఏపీ స్టేట్ ట్యాక్స్ సర్వీస్): **18 పోస్టులు**
3. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(సివిల్)(ఏపీ పోలీస్ సర్వీస్) కేటగిరీ-2: **26 పోస్టులు**
4. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్(మెన్)(ఏపీ జైల్ సర్వీస్): **1 పోస్టు**
5. డివిజనల్/డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్(స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీస్: **1 పోస్టు**
6. రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్(ఏపీ ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్): **6 పోస్టులు**
7. డిస్ట్రిక్ట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్(ఏపీ బీసీ వెల్ఫేర్ సర్వీస్): **1 పోస్టు**
8. డిస్ట్రిక్ట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్(ఏపీ సోషల్ వెల్ఫేర్ సర్వీస్): 3 పోస్టులు
9. డిప్యూటీ రిజిస్ట్రార్(ఏపీ కో ఆపరేటివ్ సర్వీస్): **5 పోస్టులు**
10. మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-2(ఏపీ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్): **1 పోస్టు**
11. అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్(ఏపీ ఎక్సైజ్ సర్వీస్): **1 పోస్టు**
12. అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్(ఏపీ ట్రెజరీ అకౌంట్స్ సర్వీస్): **3 పోస్టులు**
13. డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్(ఏపీ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సర్వీస్): **4 పోస్టులు**
14. అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్(ఏపీ స్టేట్ ఆడిట్ సర్వీస్): **2 పోస్టులు**

అర్హతలు: పూర్తి సమాచారం నోటిఫికేషన్‌లో చూడొచ్చు
ఎంపిక: స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
చివరి తేదీ: జనవరి 21 **స్క్రీనింగ్ టెస్ట్(ప్రిలిమినరీ ఎగ్జామినేషన్):** మార్చి 17
వెబ్‌సైట్: psc.ap.gov.in/

డిగ్రీ లెక్చరర్స్

ఖాళీలు 240

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ)...ఏపీ కాలేజియేట్ ఎడ్యుకేషన్ సర్వీస్‌కు సంబంధించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

సబ్జెక్టుల వారీగా ఖాళీలు

1. బోటనీ: **19** 2. కెమిస్ట్రీ: **26** 3. కామర్స్: **35**
4. కంప్యూటర్ అప్లికేషన్స్: **26** 5. కంప్యూటర్ సైన్స్: **31**
6. ఎకనామిక్స్: **16** 7. హిస్టరీ: **19** 8. మేథమెటిక్స్: **17**
9. ఫిజిక్స్: **11** 10. పొలిటికల్ సైన్స్: **21** 11. జువాలజీ: **19**

అర్హత: సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ, నెట్/స్లెట్/సెట్ ఉత్తీర్ణులై ఉండాలి.
ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ తదితరాల ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు: జనవరి 24 నుంచి ఫిబ్రవరి 13 వరకు
రాత పరీక్ష తేదీ: 2024 ఏప్రిల్/మే **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in/

డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్లు

ఖాళీలు 38

ఏపీ ఎడ్యుకేషనల్ సర్వీస్‌లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఖాళీల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) విడుదల చేసింది.
అర్హత: ఏదైనా పీజీతోపాటు బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి
దరఖాస్తు రుసుము: జనరల్ అభ్యర్థులకు రూ.370, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు రూ.250.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 29
స్క్రీనింగ్ పరీక్ష తేదీ: ఏప్రిల్ 13 **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

SCHOLARSHIP ALERT

Description: Tata Steel Downstream Products Limited (TSDPL) invites applications from students who are domiciles of Jamshedpur, Kalinganagar, Pantnagar,

TSDPL Silver Jubilee Scholarship Program

Faridabad, Pune, Chennai, Tada, and Kolkata. The scholarship is meant to support meritorious students from low income families to continue their education.

Eligibility: Open for students who are domiciles of locations such as Jamshedpur, Kalinganagar, Pantnagar, Faridabad, Pune, Chennai, Tada, and Kolkata are eligible to apply. Applicants must be pursuing any year of ITI/diploma, graduation or postgraduation in fields such as Nursing, UG medical courses such as MBBS, BDS, PG medical courses (any specialization), paramedical courses, ITI/diploma subjects such as fitter, electrical, welders, safety, etc. from government-recognized institutes. Must have scored at least 60% marks in their Class 10 and 12 examination. Annual family income of the applicants must not be more than INR 5,00,000 from all sources.

Prizes & Rewards: INR 1,00,000 for 1 year *Last Date to Apply:* 21-01-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/TSDPL2

PROMYS India (Program in Mathematics for Young Scientists)



Description: PROMYS India (Program in Mathematics for Young Scientists), India 2024 is an opportunity offered in partnership with the Indian Institute of Science (IISc), Bengaluru, for students in Class 9 to 12. The selected students will be awarded a full scholarship covering all tuition, housing, and meals for the six weeks of the programme.

Eligibility: Open for students aged 15 years or older by May 5th, 2024, currently enrolled in Class 9 to 12 (or equivalent) at any recognised secondary or higher secondary school across India. Applicants must have completed (or be in) Class 9 before the program begins.

Prizes & Rewards: A full scholarship covering tuition, housing, and meals for the six weeks of the programme

Last Date to Apply: 01-02-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/POR1

Piaggio "Shiksha Se Samriddhi" Program

Description: An initiative of Piaggio Vehicles Pvt. Ltd. to support the STEM education of female students from Pune, Satara, Baramati, Nashik, Aurangabad, and Ahmednagar.

Eligibility: Open to female students pursuing STEM courses.
- Students from Pune, Satara, Baramati, Nashik, Aurangabad, and Ahmednagar can apply for the scholarship.
- Final-year students enrolled in graduation, post-graduation and diploma will be eligible under this program.
- Students must have scored at least 50% marks in their previous class.
- The annual income of the family should be less than INR 4 lakh.

Note: Children of employees of Piaggio and Buddy4Study are not eligible to participate.

Prizes & Rewards: INR 15000 - INR 20,000 (based on actuals)
Last Date to Apply: 20-01-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/PSD5

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి



ఈసారి కూడా బాగా గట్టిగా కొడతాం

మహేశ్‌బాబు

"నాకూ, నాన్నగారికీ సంక్రాంతి బాగా కలిసొచ్చిన పండుగ. సంక్రాంతికి విడుదలైన మా సినిమాలు బ్లాక్‌బస్టర్లయ్యాయి. ఈ సారి కూడా బాగా గట్టిగా కొడతాం. కానీ ఈ సారి 'గుంటూరు కారం' చిత్రం రికార్డులు, వసూళ్ల గురించి మాట్లాడడానికి నాన్న మన మధ్య లేరనే వెలితి ఉంది. ఆ లోటును ఇక మీరే (అభిమానులు) తీర్చాలి. ఇకపై నాకు అమ్మా, నాన్నా... అన్నీ మీరే' అని మహేశ్‌బాబు భావోద్వేగంతో స్పందించారు. ఆయన హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈనెల 12న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం గుంటూరులో ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. ఈ సందర్భంగా మహేశ్‌బాబు మాట్లాడుతూ "త్రివిక్రమ్ అంటే నాకు చాలా ఇష్టం. గత రెండేళ్లు ఆయన నాకు అండగా నిలిచిన తీరు ఎప్పటికీ మర్చిపోలేను. ఆయన సినిమాల్లో చేసేటప్పుడు నా నటనలో ఏదో మ్యాజిక్ జరుగుతుంది. 'అతడు, ఖలేజా' చిత్రాల తరహాలో ఇప్పుడు 'గుంటూరు కారం'లోనూ అదే మ్యాజిక్ జరిగింది. ఇందులో మీరు కొత్త మహేశ్‌బాబును చూడబోతున్నారు. దానికి కారణం త్రివిక్రమే. మా నిర్మాత చినబాబు ఇష్టపడే హీరోని నేనే. వారితో మరిన్ని గొప్ప సినిమాలు తీయాలని కోరుకుంటున్నాను. చాలా రోజుల తర్వాత మన తెలుగు అమ్మాయి శ్రీలీల పెద్ద హీరోయిన్ కావడం గొప్ప విషయం. ఆ అమ్మాయితో డాన్స్ చేయాలంటే హీరోలందరికీ తాట ఊడిపోద్ది. థమన్ బెస్ట్ సాంగ్స్ ఇచ్చాడు' అని తెలిపారు. త్రివిక్రమ్ మాట్లాడుతూ 'ఒక సినిమాకు వంద శాతం పనిచేయాలంటే రెండొందల శాతం పనిచేసే హీరో ఎవరైనా ఉన్నారంటే అది మహేశ్‌బాబే. పాతికేళ్లయింది అంటున్నారు కానీ ఆయన్ను చూస్తుంటే నిన్నో, మొన్నో సినిమాల్లోకి వచ్చిన హీరోలానే ఉన్నారు. సూపర్‌స్టార్ కృష్ణగారు గొప్ప నటుడు. ఆయన నటించిన ఒక సినిమాకు సహాయ రచయితగా పనిచేశాను. అంత గొప్ప మనిషికి కొడుకుగా పుట్టిన మహేశ్‌బాబు ఎంత అదృష్టవంతుడో కదా అనిపిస్తుంది. 'అతడు, ఖలేజా' సినిమాలకు పనిచేసినప్పుడు మహేశ్ ఎలా ఉన్నారో ఇప్పుడు కూడా అలానే ఉన్నారు. నటనలోనూ అదే స్పీడ్ చూపిస్తున్నారు. షూటింగ్ తర్వాత బాగా అలసిపోయి కూడా మిమ్మల్ని కలుసుకోవడానికి గుంటూరు వచ్చారు. జనవరి 12న థియేటర్లలో కలుద్దాం. సంక్రాంతిని ఈసారి రమణగాడితో కలసి చేసుకుందాం' అన్నారు. శ్రీలీల మాట్లాడుతూ 'నాకు ఈ సినిమా మళ్లీ రీలాంచ్‌లా అనిపిస్తోంది. మహేశ్‌బాబు బంగారపు విగ్రహానికి ప్రాణం పోసినట్లు ఉంటారు. ఆయన మనసు కూడా అంతే అందమైనది' అని చెప్పారు. నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ 'మేకర్స్‌గా చినబాబు, వంశీ ప్రయాణం అద్భుతంగా ఉంది. త్రివిక్రమ్ ఈ సినిమాతో కలెక్షన్ల తాట తీస్తాడు. మహేశ్‌బాబు మరో బ్లాక్‌బస్టర్ చిత్రం ఇస్తున్నారు' అన్నారు. మీనాక్షి చౌదరి మాట్లాడుతూ 'త్రివిక్రమ్‌తో పనిచేయాలనే కోరిక ఈ చిత్రంతో తీరింది. ఆయనను అందరూ గురూజీ అని ఎందుకు పిలుస్తున్నారో అర్థమవుతోంది. మహేశ్‌బాబు గారి సినిమాలో చేయాలని అడిగినప్పుడు షాక్ తిన్నాను. ఆయనతో నటించే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నాను. ఇది మహేశ్‌గారి మాస్ ఫిల్మ్' అని అన్నారు.

రేకుల షెడ్డు కూలి అభిమానులకు గాయాలు

గుంటూరు జిల్లాలోని పెదకాకాని సమీపంలో మహేష్ బాబు హీరోగా నటించిన గుంటూరు కారం సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ లో మంగళవారం రాత్రి అపశృతి చోటుచేసుకుంది. అంచనాలకు మించి భారీగా మహేష్ బాబు అభిమానులు రావడంతో, సభ ప్రాంగణం మొత్తం కనుచూపు మేర జనసంద్రంగా మారిపోయింది. దీంతో ప్రాంగణం కుడి వైపున వాచ్‌మెన్ కోసం నిర్మించిన రేకుల షెడ్డుపైకి పెద్ద ఎత్తున అభిమానులు ఎక్కారు. మహేష్ బాబును చూసేందుకు యువత ఒక్కసారిగా ఎగబడ్డారు. దీంతో రేకుల షెడ్డు కూలిపోయింది. ఈ ఘటనలో 20 మందికి స్వల్ప గాయాలయ్యాయి. అందులో కొందరిని విజయవాడ, గుంటూరు ఆస్పత్రులకు తరలించి చికిత్స అందించారు.

- పెదకాకాని

వరాలు అందరికీ నచ్చుతుంది..



'ఇందులో నాపేరు వరాలు. స్వతంత్ర భావాలు కలిగిన అమ్మాయిని. పల్లెటూరి అమ్మాయిలంటే సాధారణంగా సున్నితంగా ఉంటారు. కానీ నేను మాత్రం ఇందులో రెబల్. సినిమా చూసినవాళ్లు 'అమ్మాయి అంటే ఇలా ఉండాలి' అనేలా నా పాత్ర ఉంటుంది' అని అషిక రంగనాథ్ అన్నారు. అక్కినేని నాగార్జున కథానాయకుడిగా విజయ్ బిన్నీ దర్శకత్వంలో శ్రీనివాస్ చిట్టూరి నిర్మించిన 'నా సామిరంగ' చిత్రంలో అషిక కథానాయికగా నటించారు. జనవరి 14న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో ముచ్చటించారు. 'నాలాంటి కొత్తమ్మాయికి నాగార్జునగారి లాంటి టాప్‌స్టార్‌తో నటించే అవకాశం రావడం నిజంగా అదృష్టం. నా కేరక్టర్‌లో రెండు కోణాలుంటాయి. కొంతభాగం యంగ్‌స్టర్‌గా, కొంతభాగం ప్రౌఢగా కనిపిస్తాను. నటనలోనే కాదు, ఆహార్యంలో కూడా తేడా ఉంటుంది. కష్టపడి చేశాను. ఇంత అద్భుతమైన పాత్ర దక్కడం నా అదృష్టం.' అంటూ ఆనందం వెలిబుచ్చారు అషిక.

మొయినుద్దీన్ రాక అప్పుడే...



క్రీడలకు మత మౌఢ్యాన్ని అద్ది.. లేనిపోని వివాదాలకు తెరలేపుతూ పెడత్రోవ తొక్కుతున్న కొందరు యువకులను సన్మార్గంలో నడిపించి, వారిలో సఖ్యతను కుదిర్చే ఓ వ్యక్తి కథే 'లాల్ సలామ్'. ఇందులో సూపర్‌స్టార్ రజనీకాంత్ మొయినుద్దీన్ అనే శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు. ముంబై నేపథ్యంలో నడిచే సినిమా ఇది. విష్ణు విశాల్, విక్రాంత్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఐశ్వర్య రజనీకాంత్ దర్శకురాలు. సుభాస్కరన్ నిర్మాత. ప్రపంచవ్యాప్తంగా ఫిబ్రవరి 9న విడుదల కానున్న ఈ పాన్‌ఇండియా సినిమాకు సంబంధించిన రిలీజ్ డేట్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. కెరీర్‌లో ఇప్పటివరకూ చేయని విభిన్న పాత్రను ఇందులో రజనీ చేసున్నారని మేకర్స్ చెబుతున్నారు. ప్రపంచ ప్రఖ్యాత క్రికెటర్ కపిల్‌దేవ్ ఇందులో ప్రత్యేక పాత్ర పోషిస్తుండటం విశేషం. జీవితా రాజశేఖర్, సెంథిల్, తంబి రామయ్య, అనంతిక, వివేక్ ప్రసన్న, తంగదురై తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: విష్ణు రంగస్వామి, సంగీతం: ఏ.ఆర్.రెహమాన్. లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ 171వ చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. విశేషమేమిటంటే.. తలైవా 172కు కూడా రంగం సిద్ధమైంది. కర్ణన్, మామన్నన్ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న మారి సెల్వరాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. లోకేశ్ కనకరాజ్ సినిమా నిర్మాణం పూర్తికాగానే, ఈ సినిమా షూటింగ్ మొదలవుతుంది.

వెంకటేశ్ నట విశ్వరూపం చూస్తారు



'జయాపజయాల గురించి పట్టించుకోను. ప్రయాణాన్ని మాత్రమే ఆస్వాదిస్తాను. నిజాయితీగా పనిచేస్తే విజయం అదే వస్తుంది' అంటున్నారు దర్శకుడు శైలేష్ కొలను. ఆయన దర్శకత్వంలో వెంకటేశ్ కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'సైంధవ్'. వెంకట్ బోయనపల్లి ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. ఈ సందర్భంగా శైలేష్ విలేకరులతో మాట్లాడారు.

- 'హిట్2' తర్వాత వెంకటేశ్‌గారిని కలిశాను. బాగా తీశావ్ అని అభినందించారు. మేం సినిమాల కంటే జనరల్ విషయాలే ఎక్కువ మాట్లాడుకునేవాళ్లం. రెండుమూడు మీటింగ్స్‌లో మా ఇద్దరికీ మంచి బాండింగ్ ఏర్పడింది. సినిమా చేయాలనుకున్నాం. 'సైంధవ్' ఐడియా చెప్పాను. ఆయనకి బాగా నచ్చింది. 'నా 75వ సినిమా అంటే ఇలా ఉండాలి' అంటూ సంబరపడిపోయారు. ఆ లైన్ డవలప్‌చేసి పూర్తి స్క్రిప్ట్ వినిపించాను. కథ మొత్తం విని హగ్ చేసుకున్నారు. 'ఇది చేస్తున్నాం' అంటూ భుజం తట్టారు
- ఎలాంటి టెన్షన్ లేకుండా సినిమాను పూర్తి చేశాను. దానికి కారణం వెంకటేశ్‌గారే. అయితే.. ప్రమోషన్స్‌లో వెంకటేశ్‌గారి ఏవీలు చూస్తుంటే.. 'ఇంతటి అద్భుతమైన జర్నీ ఉన్న హీరోతో సినిమా చేశానా!?' అని టెన్షన్ మొదలైంది. నా వరకూ దర్శకుడిగా పూర్తి సంతృప్తితో ఉన్నా. వెంకీ 75 మూవీ ఎలా ఉండాలో అలా చేశాం. ఇందులో వెంకటేశ్ విశ్వరూపం చూస్తారు. వెంకటేశ్‌గారు ఎమోషనల్‌గా చేసిన ప్రతి సినిమా హిట్టే. శత్రువు, ధర్మచక్రం, గణేశ్, తులసి.. ఇలా చెప్పుకుంటూపోతే చాలా ఉన్నాయి. ఈ సినిమా వాటిని మించేలా ఉంటుంది. ఇంత ఎమోషనల్ డెప్త్ ఉన్న కథ చేయడం నాకిదే ప్రథమం. ఇందులో వెంకటేశ్‌గారి పెర్ఫార్మెన్స్ ప్రేక్షకులకు గూజ్‌బమ్స్ తెప్పిస్తుంది. హృదయాలను ద్రవింపజేసే భావోద్వేగపూరిత సన్నివేశాలు ఉన్నాయి ఇందులో.
- స్పైనల్ మస్క్యులర్ ఆట్రోఫీ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న వారి పోరాటానికి బలమైన గొంతుకలేదు. 17కోట్ల ఇంజక్షన్ కోసం తపన పడే పేరెంట్స్ గురించి, వారి పోరాటం గురించి మనకి పెద్దగా అవగాహనలేదు. సమాజంలో ఈ విషయంపై అవగాహన పెంచాలంటే విస్తృతంగా కమ్యునికేట్‌చేసే నటులు కావాలి. వెంకటేశ్‌గారితోపాటు ఆండ్రియా, రుహానీ శర్మ లాంటి నటులు ఇందులో భాగమవ్వడానికి కారణం అదే. ఒక పవిత్రభావనతో తయారు చేసుకున్న కథ ఇది. అందుకే అందరికీ కనెక్ట్ అవుతుందని నమ్ముతున్నాను.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/zcm5i4p లో చదవండి.

నిజాలు తెలుసుకొని వార్తలు రాయండి

తెలుగు చలనచిత్ర పరిశ్రమ

ఇక నుంచి మెయిన్‌స్ట్రీమ్ మీడియా, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా సంస్థలు చిత్ర పరిశ్రమను ఇబ్బందిపెట్టేలా ఇష్టం వచ్చిన రాతలు రాస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి, తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర వాణిజ్య మండలి, తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి సంయుక్తంగా హెచ్చరించాయి. ఈ మేరకు మంగళవారం ఆ మూడు సంస్థలు సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశాయి. నిజాలను నిర్భయంగా ప్రచారంలో పెట్టవచ్చు కానీ అసత్యాలు, ఈర్ష్య ద్వేషాలతో వ్యక్తుల గౌరవాన్ని దెబ్బతీయడం సరైనది కాదని లేఖలో మీడియా సంస్థలకు హితవు పలికాయి. కొన్ని వెబ్‌సైట్లు, డిజిటల్ మీడియా సంస్థలు సంక్రాంతి టైంలో వాళ్ల రేటింగ్స్ కోసం అదేపనిగా తమకు నచ్చినట్లు వార్తలు రాయడం వల్ల హీరోలు, దర్శకులు వారి అభిమానుల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్నారు, కాబట్టి ఇక నుంచి ఏ మీడియా సంస్థ అయినా వార్తలు ప్రచురించే ముందు మా మూడు సంస్థలను సంప్రదించి నిజాలు తెలుసుకోవాలని కోరాయి. సినీ ప్రముఖులు మాట్లాడేటప్పుడు పూర్తిగా అవగతం చేసుకోకుండా మిడిమిడి జ్ఞానంతో పరిశ్రమ ఇబ్బందిపడేలా వార్తలు రాయడం విచారకరం అని పేర్కొన్నాయి. సంక్రాంతి సినిమాల మధ్య పోటీ ఆహ్లాదకరంగా ఉండాలనీ, తెలుగు సినిమా హీరోలు, దర్శకులు, నిర్మాతలు... ఎవరూ నష్టపోకూడదనీ మా మూడు సంస్థలు కలసి కృషి చేస్తుంటే సహకరించాల్సింది పోయి మీడియా సంస్థలు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని సూచించాయి. తెలుగు సినీ పరిశ్రమకు పుట్టుక నుంచి మీడియాతో ఉన్న అనుబంధాన్ని దృష్టిలో ఉంచుకొని ఇబ్బందికర వ్యాఖ్యలు చేసేవారిపైన తగు చర్యలు తీసుకోవాలని సినీ పాత్రికేయ సంఘాలు, మీడియా యాజమాన్యాలను లేఖలో అభ్యర్థించాయి.

అంతర్జాతీయ క్రీడాకారుడికి జనసేనపార్టీ ఆర్థికసాయం

బాపట్ల,జనవరి 9 : బాపట్ల మండలం వెదుళ్ళపల్లి గ్రామానికి చెందిన క్రీడాకారుడు కోట రాజేష్ ఫిబ్రవరి 2న దుబాయ్‌లో జరిగే అంతర్జాతీయ త్రోబాల్‌కు భారత దేశం తరుపున ఎంపికయ్యారు. ఆ క్రీడాకారుడిని ప్రోత్సహిస్తూ దాతల సాయంతో జనసేన పార్టీ తరుపున రూ.25,116 ఆర్థిక సహాయాన్ని మంగళవారం ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసీకుమారి అందజేశారు. కార్యక్రమంలో కర్లపాలెం మండల ఉపాధ్యక్షుడు చిలకల సురేంద్రబాబు, సీనియర్‌నాయకులు విష్ణుమొలకలచంద్రమోహన్, బాపట్ల యువనాయకులు కారుమూరి అంజనేష్, కత్తి నాగలక్ష్మీ, కామిశెట్టి సాయిబాబు, కొండపాటూరి వీరాంజనేయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

బాపట్ల టౌన్, జనవరి 9 : బాలింతలు, చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పే అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను వైసీపీ ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. నెలరోజులుగా జీతాలు లేకుండా సమ్మెచేస్తున్న వారిని ఆదుకోవటానికి మంగళవారం ఒక్కొక్కరికి 25 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చిరుఉద్యోగులైన అంగన్‌వాడీలపై వైసీపీ ప్రభుత్వం కక్ష గట్టి ఎస్మా చట్టాన్ని అమలు చేయటం దారుణమన్నారు.

12వ తేదీలోగా సమస్యలు పరిష్కరించాలి

● నియోజకవర్గ ఎన్నికల అధికారి మోహన్‌రావు

వేమూరు, జనవరి 9 : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 22న ఓటర్ల తుది జాబితా ప్రకటించడం జరుగుతుందని, అధికారులు ఈనెల 12లోగా సమస్యలను పరిష్కరించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి జల్లి మోహన్‌రావు అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఫొటోలు, పేర్లు, చిరునామా వివరాలు డబుల్ ఎంట్రీలపై పూర్తిగా పరిశీలించాలన్నారు. మరికొన్ని సమస్యలపై సమావేశానికి హాజరైన టీడీపీ, వైసీపీ నాయకులతో చర్చించారు.

అట్టహాసంగా శ్రీ భ్రమరా సంక్రాంతి కప్ క్రికెట్ పోటీలు ప్రారంభం

● తొలిరోజు విశాఖపట్నం, హైదరాబాద్ జట్ల శుభారంభం



బ్యాంటింగ్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభించిన సినీనటుడు రఘుబాబు

మేదరమెట్ల, జనవరి 9: రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్(ఆర్ఎస్‌సీఏ) ఆధ్వర్యంలో 30వ శ్రీ భ్రమర సంక్రాంతి కప్ క్రికెట్ పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రముఖ సినీనటుడు యర్రా రఘుబాబు మాట్లాడుతూ అత్యున్నత ప్రమాణాలతో టోర్నమెంట్ నిర్వహించేందుకు కృషి చేసిన ఆర్ఎస్‌సీఏ సభ్యులను, టోర్నమెంట్‌కు సహకరిస్తున్న శ్రీ భ్రమర టౌన్‌షిప్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గల్లా రామచంద్రరావును అభినందించారు. గల్లా రామచంద్రరావు మాట్లాడుతూ మారుమూల పల్లెటూరులో అత్యున్నత ప్రమాణాలతో కూడిన క్రికెట్ స్టేడియం నిర్మించడంతో పాటు టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్న ఆర్ఎస్‌సీఏ సభ్యులను అభినందించారు. అఖిల భారత బ్యాడ్మింటన్ సమాఖ్య మాజీ కార్యదర్శి కరణం పున్నయ్య చౌదరి మాట్లాడుతూ ఆర్ఎస్‌సీఏ స్టేడియంలో క్రికెట్ అకాడమి నెలకొల్పేందుకు రాష్ట్ర క్రికెట్ బోర్డు సభ్యులతో మాట్లాడతానని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌సీఏ అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరరావు, ప్రముఖ వైద్యులు బి.జవహార్, ప్రముఖ న్యాయవాది మోహన్‌దాస్, ఆర్ఎస్‌సీఏ సభ్యులు పాల్గొన్నారు.

తొలిరోజు విజేతలు విశాఖపట్నం, హైదరాబాద్ జట్లు

తొలిరోజు రోజు జరిగిన మ్యాచ్‌లో విశాఖపట్నం, హైదరబాద్ జట్లు గెలుపొందాయి. కరణం పున్నయ్య చౌదరి టాస్ వేయగా రఘుబాబు బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. గల్లా రామచంద్రరావు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఉదయం జీడీసీఏ లెవెన్ గుంటూరు, సిక్కోలు సీతాస్ వైజాగ్ జట్ల మధ్య పోటీలు జరిగాయి. టాస్ గెలిచిన వైజాగ్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేసిన గుంటూరు జట్టు 15 ఓవర్లలో 89 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌చేసిన వైజాగ్ జట్టు 9 ఓవర్లలోనే 90 పరుగులు చేసి విజయం సాధించింది. మధ్యాహ్నం కోకా ఇన్‌ఫ్రా లెవెన్ హైదరబాద్, సీడీసీఏ లెవెన్ తిరుపతి జట్లు తలపడ్డాయి. హైదరాబాద్ జట్టు 20 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 213 పరుగులు చేసింది. ఈ జట్టులో తేజ 59 బంతులలో 119 పరుగులు చేసి సెంచరీ సాధించాడు. అనంతరం బ్యాంటింగ్ చేసిన తిరుపతి జట్టు 18 ఓవర్లలో 106 పరుగులకు ఆలౌట్ అయింది.

బోధకాలు వ్యాధి నిర్ధారణకు రక్తపూతలు సేకరణ

కొల్లూరు, జనవరి 9 : మండల పరిధిలోని క్రాప గ్రామంలో జిల్లా మలేరియా అధికారి వై.రాజ్‌కుమార్ పర్యవేక్షణలో రక్తపూతల సేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో తెనాలి మలేరియా శాఖ సహాయ అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి, సబ్ యూనిట్ అధికారి వంగల పున్నారెడ్డి, సూపర్‌వైజర్ పుట్టగంటి శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యదర్శి నాగజ్యోతి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.





ప్రతి ఇంటికెళ్ళి చీర, సంచి అందజేస్తున్న మండల, గ్రామ టీడీపీ నాయకులు

గ్రామాల్లో 'బాబు షూ్యరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ'

పిట్టలవానిపాలెం, జనవరి 9 మండలపరిధిలోని ఖాజీపాలెం గ్రామ పంచాయతీలోని నాయీబ్రాహ్మణ కాలనీ, కాపుల కాలనీ, ఎస్టీ కాలనీ, గౌడపాలెం, ముస్లిం కాలనీ, బీసీ కాలనీలలో నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ ఆదేశాల మేరకు మంగళవారం మీమాటే-నాబాట, బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటి కార్యక్రమాన్ని మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేటి సోపాటి, టీడీపీ మండలఅధ్యక్షుడు ఎండీ అఫ్జల్, మండల, గ్రామ పార్టీ నాయకులతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిఇంటికెళ్ళి మహిళలకు చీర, నిత్యావసరాలు తెచ్చుకునే సంచి, నరేంద్రవర్మ గురించి తెలియజేసే కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎండిఅఫ్జల్, ఖాజీపాలెం మాజీ సర్పంచ్ మంతెన శ్రీదేవి కృష్ణమూర్తిరాజు, టీడీపీ యువ నాయకులు కొత్తపల్లి పృధ్వీరాజు, ఖాజీపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షులు దండు శ్రీనివాస్‌రాజు, టీడీపీ మండల మాజీ అధ్యక్షులు గోకరాజు శ్రీధర్‌వర్మ, టీడీపీ నాయకులు లక్కంరాజు వెంకటపతిరాజు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు మోదుగుల శంకరరెడ్డి, కనుమూరి సాంబమూర్తిరాజు, తెలుగు మహిళలు, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హైవెండ్ హైస్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

కర్లపాలెం, జనవరి 9 : కర్లపాలెంలోని హైవెండ్ హైస్కూల్‌లో విద్యార్థులు మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. బాలబాలికలు సాంప్రదాయ దుస్తులలో వేడుకలలో పాల్గొన్నారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ సాయిమహేంద్రబాబు, డైరెక్టర్ చాందినీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు, గాలిపటాల ఎగురవేసే పందాలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వెంకటజ్యోతి, ఛైర్మన్ పి.ఉదయచంద్రరావు, నందనవనం శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు గోపిచంద్, షర్మిలబేగం, రఫీ, ఆషాబీ, నెహ, అనిత, సుమలత, రామలక్ష్మి, స్వప్న, రవళి, రజియాసుల్తానా, ఆదినారాయణ, రమణ, హిమబిందు, ద్వారకా రాణి పాల్గొన్నారు.



హైవెండ్ హైస్కూల్‌లో భోగిమంటలు వేస్తున్న చిత్రం

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

రేపల్లె, జనవరి 9 : మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చేయాల్సిన అవసరం ఉందని రేపల్లె ఏరియా కోఆర్డినేటర్ జీ.రమాదేవి అన్నారు. స్థానిక శ్రీశక్తి కార్యాలయంలో వీవోఏ, సిఆర్‌పీలకు మంగళవారం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సర్ప్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన లఘుపతి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఎన్.శ్రీనివాసులరెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు దేవీ ప్రసన్న, మంజుల, శేషావతారం, నాగలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

చేనేత పరిశ్రమ రక్షణకు కార్మికులు ఐక్యం కావాలి

భట్టిప్రోలు, జనవరి 9 : పాలక ప్రభుత్వాల నిర్ణయాల కారణంగా చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని పరిశ్రమ రక్షణకు కార్మికులు ఐక్యం కావాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యులు గొట్టుముక్కల బాలాజీ పిలుపునిచ్చారు. స్థానిక రైలుపేట చేనేత సొసైటీ భవనంలో చేనేత కార్మిక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు కొడాలి రామకోటేశ్వరరావు, కొన్నిపాటి మోహనరావు, కార్మికులు ఎన్.జగన్మోహనరావు, కె.కోటేశ్వరరావు, డోగుపర్తి రామారావు, బట్టు పెద్దిరాజులు, బాలకృష్ణ, కనకం తదితరులు పాల్గొన్నారు.













తొలి మహిళా ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా

● సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ

బాపట్లటౌన్, జనవరి 9 : తొలి భారత మహిళా ముస్లిం ఉపాధ్యాయురాలుగా మహిళా విద్యావికాసానికి సావిత్రిబాయిపూలేతో కలిసి ఎనలేని కృషి చేసిన మహిళా జగతి దివ్య జ్యోతి షేక్ ఫాతిమా అని సాహితిభారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ మంగళవారం అన్నారు. షేక్ ఫాతిమా జయంతి సభలో సాహితిభారతి కోశాధికారి ఆదం షఫి, ఉపాధ్యక్షులు మద్రిమాల్యాద్రిరావు, ఎన్.కృష్ణ, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి తదితరులు షేక్ ఫాతిమ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు

● బాపట్ల, జనవరి 9 : బాపట్ల పట్టణంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అధ్యక్షుడు జేడీ శీలం ఆదేశాల మేరకు బాపట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడు పఠాన్ రాజేష్ ఆధ్వర్యంలో షేక్ ఫాతిమా జయంతి మంగళవారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రోశయ్య, నజీర్, బాషా, సిరాజ్, ఇస్సాకు, ముజీబ్, కరీముల్లా, రేణుక పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యలపై సమావేశం

వేమూరు, జనవరి 9 : వేమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల వినియోగదారుల సమస్య పరిష్కారం కోసంగా బుధవారం ఉదయం 10 గంటలకు సబ్‌స్టేషన్ భవనంలో ప్రత్యేక సమావేశం ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏఈ గోపి తెలిపారు. గృహ వినియోగదారులు, రైతులు, ఇండస్ట్రీయల్ వినియోగదారులు హాజరై సమస్యలు తెలియపరచాలన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

బాపట్లటౌన్, జనవరి 9 : విశాఖలో ఈనెల 6, 7 తేదీలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కన్వీనర్ షేక్ నజీర్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను మంగళవారం ఆయన అభినందించారు. జిల్లాలో 19 మంది క్రీడాకారులు 55 మెడల్స్‌ను గెలుచుకున్నారని తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులు ఫిబ్రవరి 8 నుంచి 11వ వరకు హైదరాబాద్‌లో జరుగు జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించారని తెలిపారు.



వైసీపీ సాధికార బస్సు యాత్ర వాయిదా

అద్దంకి, జనవరి 9: అద్దంకిలో గురువారం జరగాల్సిన వైసీపీ సాధికార బస్సు యాత్ర వాయిదా పడటం పలు అనుమానాలకు తావిస్తుంది. అద్దంకి నియోజక వర్గంలోని వైసీపీలో వర్గ విభేదాలు తారస్థాయికి చేరాయి. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న పాణెం హనిమిరెడ్డి పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శాప్‌నెట్ ఛైర్మన్ బాచిన కృష్ణచైతన్య ఏదోవిధంగా నియోజకవర్గంలో జరిగే పలు కార్యక్రమాలకు హాజరవుతున్నారు. రోజుకొక మండలం చొప్పున వైసీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీంతో మండలస్థాయి నేతలు, పలు విభాగాల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు రెండు వర్గాలుగా విడిపోయారు.

ఈనేపథ్యంలో వైసీపీ సాధికార బస్సు యాత్రకు బాచిన వర్గం నేతలు దూరంగా ఉండే అవకాశం ఉంది. దీంతో వర్గపోరు మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో సాధికార బస్సు యాత్ర వాయిదా పడిందన్న అనుమానాలు కలుగుతున్నాయి. బస్సు యాత్రకు హాజరు కావాల్సిన పలువురు వైసీపీ ప్రధాన నేతలు 11వ తేదీ అందుబాటులో ఉండే అవకాశం లేకపోవటంతో వాయిదా వేసినట్లు వైసీపీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఏదిఏమైనా సాధికార బస్సు యాత్ర వాయిదా పడటాన్ని మాత్రం వైసీపీలోని రెండు వర్గాలు ఎవరికివారు తమకు అనుకూలంగా అన్వయించుకుంటున్నారు.

యూటీఎఫ్ నాయకుల అరెస్ట్ అన్యాయం

చినగంజాం, జనవరి 9: విజయవాడలో మంగళవారం జరిగే ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా అక్రమ అరెస్టులు చేసి పోలీసుస్టేషన్లకు తరలించడం అన్యాయమని యూటీఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.పాపారావు, మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని యూటీఎఫ్ నాయకులు పలువురికి విజయవాడ ధర్నాకు అనుమతి లేదంటూ చినగంజాం పోలీసులు నోటీసులు అందజేశారు. పాపారావు, శ్రీనివాసరావును చినగంజాం పోలీసులు సోమవారం రాత్రి 10.30 గంటలకు అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్లో నిర్బంధించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఆర్థిక సంబంధమైన బకాయిలు విడుదల చేయాలని యూటీఎఫ్ కార్యాచరణలో భాగంగా మంగళ, బుధవారలలో విజయవాడలో 36 గంటల ధర్నాకు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో యూటీఎఫ్ నాయకులు, కార్యకర్తలను విజయవాడ వెళ్ళనీయకుండా అక్రమంగా అరెస్టులు చేసి పోలీసుస్టేషన్లలో నిర్బంధించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. మంగళవారం మధ్యాహ్నం వారిని విడుదల చేశారు.

అద్దంకిటౌన్: తమ సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాలు చలో విజయవాడకు పిలుపునిచ్చాయి. ఈక్రమంలో సోమవారం రాత్రి పోలీసులు యూటీఎఫ్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకువచ్చారు. మూడు గంటల పాటు అక్కడే ఉంచి, అనంతరం నోటీసులు అందజేసి పంపించి వేశారు. యూటీఎఫ్ ఆడిట్ కమిటీ కన్వీనర్ జె.బాబురావు, గంగాధర్, ఇట్టా రామారావు, పూర్ణచంద్రరావు, ఎన్.హనుమంతరావుతో పాటు మరికొంత మందికి పోలీసులు విజయవాడ ధర్నాకు వెళ్ళకుండా నోటీసులు అందజేశారు.

మార్టూరు: విజయవాడలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల ధర్నాకు వెళ్లకుండా మండలంలోని ముగ్గురు యూటీఎఫ్ నాయకులను మంగళవారం వేకువ జామున పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సునిల్, రంగస్వామి, కందిమళ్ల రవి లను పోలీసులు వారి ఇళ్ల వద్ద అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఉదయం 7 గంటలకు నోటీసులు ఇచ్చి వదిలి పెట్టారు.

చీరాలటౌన్: విజయవాడలో మంగళవారం జరిగే ధర్నాకు వెళ్లకుండా పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా సోమవారం రాత్రి నుండే ఉపాధ్యాయులకు నోటీసులు జారీ చేశారు. వన్‌టౌన్‌లో మాత్రం కొందరు ఉపాధ్యాయులను స్టేషన్‌కు తరలించి మంగళవారం ఉదయం విడుదల చేశారు.

రేపటి నుంచి అనంతవరంలో నాటికల పోటీలు

యద్దనపూడి(మార్టూరు), జనవరి 9: యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో ఈనెల 11 నుంచి 15 వరకు ఎన్టీఆర్ కళాపరిషత్ ద్వితీయ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కళా పరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు తెలిపారు. మంగళవారం సాయంత్రం అనంతవరం గ్రామంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పోటీలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ప్రతిరోజూ 3 నాటికలు, ఐదు రోజులలో 15 నాటికలను ప్రదర్శిస్తారన్నారు. 11 వతేదీ రాత్రి ఈ నాటికల పోటీలను ఒంగోలు ఎన్టీఆర్ కళా పరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు ప్రారంభిస్తారని చెప్పారు. సమావేశంలో గుదే తారక రామారావు, మద్దినేని జయరామకృష్ణ, పోపూరి సుబ్బారావు, పెదవల్లి వెంకటేశ్వర్లు, కొరటాల వంశీ, నిమ్మల సాంబశివరావు,పెదవల్లి కల్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శించే నాటికలు.. 11వతేదీ శార్వాణి ఫైన్ ఆర్ట్స్ బోరువంక వారిచే కొత్త పరిమళం నాటికను ప్రదర్శిస్తారు. గంగోత్రి పెద కాకాని వారితో ఆస్తికలు , మైత్రి కళా నిలయం వారితో బంధం నాటికను ప్రదర్శిస్తారు. ఈ నాటిక పోటీలకు ముందు సినీ నటుడు రఘుబాబును కమిటి సభ్యులు సత్కరిస్తారు. 12న మిత్రా క్రియేషన్స్ హైదరాబాదు వారితో కన్నీటికథ,కళాంజలి హైదరాబాదు వారిచే రైతే రాజు, అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారిచే జరుగుతున్న కథ నాటిక ను ప్రదర్శిస్తారు.

13వతేదీ తెలుగు కళాసమితి విశాఖ పట్నం వారిచే నిశబ్ధమా నీ ఖరీదెంత, ఉషోదయ కళానికేతన్ కట్రపాడు వారిచే ప్రక్షాళన, సుకృతి క్రియేషన్స్ చిలకలూరిపేట వారిచే మిణుగురు వెలుగులు నాటికను ప్రదర్శిస్తారు. 14వతేదీ న్యూస్టార్ మోడరన్ థియేటర్ ఆర్ట్స్ విజయవాడ వారిచే కపిరాజు, రసఝరి పొన్నూరు వారిచే కాపలా, శ్రీకారం కళాపరిషత్ మార్టూరు వారిచే రైతు భారతం నాటికను ప్రదర్శిస్తారు. చివరగా 15వతేదీ అభినయ ఆర్ట్స్ గుంటూరు వారిచే ఇంద్ర ప్రస్థం, చైతన్య కళాభారతి కరీంనగర్ వారిచే స్వప్నం రాల్చిన అమృతం, వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వెలగలేరు వారిచే రాత నాటికను ప్రదర్శిస్తారు. ముగింపు రోజున ముఖ్యఅతిథి సినీ దర్శకుడు అనిల్ రావిపూడి, విశిష్ట అతిథి సినీ నటుడు అజయ్ ఘోష్‌తో పాటు సినీ దర్శకుడు గోపిచంద్ మలినేనిని కళాపరిషత్ సత్కరిస్తుంది.

భార్యను హత్యచేసిన భర్త

అద్దంకి, జనవరి 9: ఎనిమిదేళ్ళ క్రితం ప్రేమించి పెళ్ళి చేసుకున్న వ్యక్తి అనుమానంతో భార్యను హత్యచేసిన సంఘటన మండలంలోని కలవకూరులో చోటు చేసుకుంది. కలవకూరుకు చెందిన పి.రాజశేఖర్‌రెడ్డి 8ఏళ్ళ క్రితం శంకరవరప్పాడుకు చెందిన రాజ్యలక్ష్మిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. వీరికి సంతానం లేకపోవటం, భార్యకు మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో సోమవారం సాయంత్రం రోకలి బండతో దాడిచేశాడు. తీవ్రగాయాలైన రాజ్యలక్ష్మిని(27) తొలుత ఒంగోలులోని ఓ ప్రయివేట్ వైద్యశాలకు తరలించి, అనంతరం రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందింది. మృతురాలి తండ్రి హనుమారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు

అద్దంకి, జనవరి 9: మండలంలోని కలవకూరులో సాగర్‌బాబుకు చెందిన భూమిని అగ్రవర్ణాలకు చెందిన ప్రసాదరెడ్డి, మరో ఇద్దరు బినామీ పేర్లతో ఆక్రమించారు. మంగళవారం సాగర్‌బాబు తన భూమిలోకి వెళుతుండగా ప్రసాదరెడ్డి, మరో ఇద్దరు అడ్డగించి కులంపేరుతో దూషించారు. ఈసంఘటనపై సాగర్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రవాసాంధ్రుల సాయంతో రూపుదిద్దుకున్న మహాప్రస్థానం

- రూ.కోటి యాభై లక్షలతో నిర్మాణం
- నేడు కుంకలమర్రులో ప్రారంభం



కుంకలమర్రులో రూపుదిద్దుకున్న మహా ప్రస్థానం

కుంకలమర్రు(పర్చూరు), జనవరి 9: కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామంలో రూపుదిద్దుకున్న మహాప్రస్థానాన్ని బుధవారం ఉదయం ప్రారంభించనున్నట్లు రావి శేషయ్య ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీచెన్నకేశవ రూరల్ డెవలప్‌మెంట్ అసోషియేషన్(ఎస్ఆర్‌డీఏ) ఆధ్వర్యంలో ప్రవాసాంధ్రుల ఆర్థిక సహకారంతో మహా ప్రస్థానం(హిందూవ శ్మశాన వాటిక)ను నిర్మాణం చేశారు. గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రులు(ఎన్ఆర్ఐ)కీర్తిశేషులు రావి సుబ్బారాయుడు జ్ఞాపకార్థం వారి కుమారులు రూ.కోటి ఆర్థిక సహకారం అందించారు. అదే గ్రామానికి చెందిన వైధిన సుమంత్ ఆధ్వర్యంలో మరికొంతమంది ఎన్ఆర్‌ఐలు రూ.50 లక్షలు ఇచ్చినట్టు నిర్వాహకులు తెలిపారు. రూ.కోటి యాభై లక్షలతో మహాప్రస్థానం రూపుదిద్దుకుందని శేషయ్య పేర్కొన్నారు. మహాప్రస్థానం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీమంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరావు, దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రవాసాంధ్రుడు రావి భాస్కరావు ఆధ్వర్యంలో మహాప్రస్థానం ప్రారంభోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు.

మైనింగ్ అధికారుల వసూళ్లపర్వం

- ఉన్నతాధికారుల కోసమంటూ దందా
- పరిశ్రమల యజమానులు బెంబేలు
- కంగుతింటున్న అధికారపార్టీ నేతలు

అద్దంకి, జనవరి 9: మైనింగ్ అధికారుల వసూళ్లపర్వంతో పరిశ్రమల నిర్వాహకులు బెంబేలెత్తిపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారుల పేర్లు చెప్పి వసూలు చేయటం మరింత విమర్శలకు తావిస్తుంది. అద్దంకి నియోజకవర్గంలోని బల్లికురవ, సంతమాగులూరు మండలాలలో గ్రానైట్ క్వారీలతో పాటు ఫ్యాక్టరీలు వందల సంఖ్యలో ఉన్నాయి. బల్లికురవ, అద్దంకి మండలాల్లో మెటల్ క్వారీలు, క్రషర్‌లు పదుల సంఖ్యలో ఉన్నాయి.

ఈనేపథ్యంలో ఇటీవల కాలంలో అద్దంకి ప్రాంతంలో పర్యవేక్షణ చేసే మైనింగ్ అధికారులు భారీ మొత్తంలో వసూళ్లపర్వానికి తెరలేపటం విమర్శలకు తావిస్తుంది. బడా అధికార పార్టీ నేతలను మినహాయించి మిగిలిన పరిశ్రమల యజమానులకు వసూళ్ళ షాక్ తగిలింది. ఆయా పరిశ్రమల స్థాయిని బట్టి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తుంది. కనీసం ఐదారు కోట్ల రూపాయలు వసూళ్ళు లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సమాచారం. మామూళ్లు ఇచ్చేందుకు నిరాకరించిన పరిశ్రమల నిర్వాహకులను దాడుల పేరుతో బెదిరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అసలే గ్రానైట్ పరిశ్రమలు, క్రషర్‌ల నిర్వాహకులు నష్టాలతో సతమతమవుతుండగా, అధికారుల వసూళ్లపర్వానికి తెరలేపటం పరిశ్రమల యజమానులలో మరింత ఆందోళన పెంచుతుంది. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వం ఒకవైపు అవినీతిరహిత పాలన అందిస్తున్నామని ప్రకటిస్తుండగా అధికారుల వసూళ్ళ డిమాండ్‌ను చూసి వైసీపీ నేతలు సైతం ముక్కున వేలు వేసుకుంటున్నారు. మైనింగ్ అధికారుల ఫోన్ నెంబర్‌లను కొంతమంది అధికారపార్టీ నేతలు బ్లాక్ లిస్టులో పెట్టగా, మరికొంత మంది మామూళ్ళు ఇచ్చే ప్రసక్తే లేదని, చేతనైనది చేసుకోండని కూడా చెప్పినట్లు సమాచారం. అత్యధికశాతం పరిశ్రమల నిర్వాహకులు మాత్రం చేయగలిగింది లేక అడిగినకాడికి ముట్టజెప్పినట్లు తెలుస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మైనింగ్ అధికారుల వసూళ్లపర్వానికి తెరవేయాలని పరిశ్రమల యజమానులు కోరుతున్నారు.

ప్రభుత్వ బెదిరింపులకు భయపడం!

- అంగన్‌వాడీలపై దుర్మార్గపు జీవోలు పని చేయవు!
- డిమాండ్‌లు పరిష్కారమయ్యే వరకు నిరసనలు
- పలు సంఘాలు సంఘీభావం



ఇంకొల్లులో రోడ్డుపై బైటాయించి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

అద్దంకిటౌన్, జనవరి 9: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారులతో, ఎస్మా జీవోలతో బెదిరిస్తే బెదిరేది లేదని, సమస్యలు పరిష్కారమయ్యేవరకు నిరసనలు కొనసాగుతాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ గంగయ్య హెచ్చరించారు. మంగళవారం జైలుభరో కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం ముట్టడి నిర్వహించారు. మున్సిపల్ కార్మికులు, వివిధ పార్టీల నాయకులు, పలు సంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు, గంగయ్యను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేశారు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, పలుసంఘాల నాయకలు వారిని స్టేషన్‌కు తీసుకెళ్లనీయకుండా తహసీల్దార్ కార్యాలయం ప్రధాన గేట్లు మూసివేసి అక్కడే కూర్చోని నిరసన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు కొంత సమయం తరువాత అదుపులోకి తీసుకున్న నాయకులును అరెస్టు చేయకుండా అక్కడే వదిలివేయడంతో నిరసనను విరమించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు శింగరకొండ, కేఎల్‌డీ ప్రసాద్, రావులపల్లి కోటేశ్వరరావు, బీఎస్పీ నాయకుడు మందా జోసప్, ఆమ్‌ఆద్మి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరసింహారావు, జైభీమ్‌రావుభారత్ పార్టీ ఇన్‌చార్జ్ పులిపాటి హేబేలు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మెపై ఎస్మా జీవోను ప్రయోగించడం దుర్మార్గపు చర్య అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ గంగయ్య అన్నారు. అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి 29వ రోజుకు చేరుకుంది. తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో పలుసంఘాల నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

బల్లికురవ: తమకు ఉద్యోగ భద్రత కల్పించకుండా వేధింపులకు గురిచేస్తుందని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని చెప్పారు. మంగళవారం బల్లికురవ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మెలో ఉన్న అంగన్ వాడీ కార్యకర్తలు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నేతలు నాగమణి, సునంద, నిర్మల, అనురాధ, సరస్వతి, అంజలి, అరుణ, జాస్లిన్, రాజకుమారి, శివపావని, వెంకటరమణ, చిన్నమ్మాయి , తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు: మార్టూరు మండల కాంప్లెక్స్ వద్ద సమ్మెను చేస్తున్న అంగన్‌వాడీలకు మంగళవారం శ్రీవిఘ్నేశ్వర కూరగాయల వర్తక సంఘం అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు కన్నె గంటి శ్రీనివాసరావు కూరగాయలు పంపిణీ చేశారు. అంగన్‌వాడీలు మంగళవారం 29వ రోజు కూడా సమ్మెను కొనసాగించారు. శిబిరాన్ని సందర్శించిన టీడీపీ నేత శ్రీనివాసరావు పార్టీపరంగా మద్దతు తెలియచేసి దాదాపు 130 మంది అంగన్‌వాడీలకు కూరగాయలు పంపిణీ చేశారు.

అంగన్‌వాడీలు బైటాయింపు

ఇంకొల్లు, జనవరి 9: ఇంకొల్లులో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు చేపట్టిన నిరసన సమ్మె ఉత్కంఠకు దారితీసింది. పర్చూరు రోడ్డులో స్టేట్‌బ్యాంకు ఎదురుగా వాహనాల రాకపోకలను నిలిపివేసి రోడ్డుపై బైటాయించారు. వీరికి టీడీపీ, జనసేన కార్యకర్తలు మద్దతు తెలిపి పాల్గొన్నారు. సుమారు గంటకు పైగా రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. ఎస్సై నాయబ్‌రసూల్ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ఆ పార్టీల నాయకులను ముందుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. సీఐటీయూ మండల కార్యదర్శి నాగండ్ల వెంకట్రావును పోలీసులు బలవంతంగా వాహనంలోకి నెట్టడంతో ఉద్రిక్తతకు దారితీసింది. అంగన్‌వాడీలను రోడ్డుపై నుంచి మహిళా కానిస్టేబుళ్లు బలవంతంగా తొలగించేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలో పోలీసులు, అంగన్‌వాడీల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసు సిబ్బంది స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వరకు సుమారు 60 మందికి పైగా అంగన్‌వాడీ కార్యకర్తలు, టీడీపీ, జనసేన నాయకులు, సీఐటీయూ నేత వెంకట్రావును స్టేషన్‌లోనే ఉంచారు.

పర్చూరు: తమకు కనీస వేతనం పెంచాలని, న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించటం దుర్మార్గమైన చర్య అని ప్రజాసంఘం నేత చింతగుంట శ్రీనివాసరావు అన్నారు. సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు స్థానిక సీడీపీవో కార్యాలయం నుంచి ర్యాలీగా బొమ్మల సెంటర్‌కు చేరుకొని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ లు, ప్రజాసంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- కట్టెల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ తగిలి కారు బోల్తా



ప్రమాదంలో చెల్లచెదురుగా పడిపోయిన ట్రాక్టర్‌లోని కట్టెలు




కారులో ఇరుక్కున్న మృతదేహాన్ని బయటకు తీయిస్తున్న ఎస్ఐ వేమన

బల్లికురవ, జనవరి 9: మండల పరిధిలోని అద్దంకి- నార్కెట్‌పల్లి రాష్ట్రీయరహదారిలో వి.కొప్పెరపాడు వద్ద మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో పల్నాడు జిల్లా వినుకొండ మండలం గోకనకొండ గ్రామానికి చెందిన వల్లెం ఆంజనేయులు(20), తెలంగాణకు చెందిన వి. దీపక్‌రావు(41) అక్కడికక్కడే మృతి చెందారు. అందిన సమాచారం మేరకు.. గోకనకొండకు చెందిన కట్టెల ట్రాక్టర్ అద్దంకి వైపు వెళ్తొంది. కొప్పెరపాడు గ్రామ సమీపానికి వచ్చేసరికి హైదరబాద్ నారాయణ గూడకు చెందిన వి.దీపక్‌రావు కారు డ్రైవింగ్ చేస్తూ కట్టెల ట్రాక్టర్‌ను క్రాస్ చేసేందు ప్రయత్నించి కట్టెలు తగలడంతో కారు ముందుకు వెళ్ళి బోల్తా పడింది. బోల్తా పడిన కారును తప్పించేక్రమంలో ట్రాక్టర్ కూడా నామ్ రోడ్డుపై పడిపోయింది.

ఈప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ పక్కన కూర్చోని ఉన్న గోకనకొండకు చెందిన వల్లెం ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. కారు మూడుసార్లు పల్టీలు కొట్టి బోల్తా పడటంతో కారులోని డ్రైవర్ దీపక్‌రావు ఇరుక్కుపోయి ప్రాణాలు వదిలాడు. కొప్పెరపాడు సమీపంలో ప్రమాదవార్త తెలియగానే స్థానికులు పెద్దఎత్తున అక్కడకు చేరుకున్నారు. అడవితుమ్మ కట్టెలను ట్రాక్టర్ డోర్లు విడిసి వేసుకొని వెళ్తుండడంతో కారు డ్రైవర్‌కి దగ్గరకు వచ్చే వరకు కనిపించకపోవడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. నామ్ రోడ్డుపై ప్రమాదం జరిగి చెల్లాచెదురు గా రెండు వాహనాలు పడిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ వి.వేమన పరిశీలించి కారులో ఇరుక్కుపోయిన మృత దేహాన్ని బయటకు తీసే చర్యలు చేపట్టారు.

వినియోగదారుల సమస్యలను పరిష్కరించాలి

- ఎమ్మెల్యే కరణం బలరాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం బలరాం

చీరాల, జనవరి 9: విద్యుత్ వినియోగదారుల సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అధికారులకు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ హాల్లో మంగళవారం రాత్రి ఎమ్మెల్యే బలరాం విద్యుత్ అధికారులు, ఎంపీడీవో, తదితర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గ పరిధిలో పలువురు నాయకులు తమతమ ప్రాంతాల్లో విద్యుత్‌శాఖపరంగా పరిష్కరించాల్సిన సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. వాటి పరిష్కారం యుద్ధప్రాతిపదికన జరగాలని బలరాం చెప్పారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, విద్యుత్‌శాఖ ఎస్ఈ సత్యనారాయణ, ఈఈ జాన్ థామస్, చీరాల, వేటపాలెం డీఈఈలు శ్రీనివాసరావు, శ్రీనివాసులు, మున్సిపల్ డీఈ ఏసయ్య, ఎంపీడీవో నేతాజీ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలి

చీరాల, జనవరి 9: వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో రూసా(రాష్ట్రీయ ఉచితార్ శిక్షా అభియాన్) నిధులు రూ.2 కోట్లతో నిర్మించిన నూతన భవన సముదాయాన్ని మంగళవారం ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలన్నారు. అనంతర కళాశాలలోని గాంధీ మ్యూజియంను సందర్శించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అడ్డగడ వేణుగోపాల్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ మన్నేపల్లి బ్రహ్మయ్య, కళాశాల కమిటీ సభ్యులు వేణుగోపాల్, బాబాజీరావు, తహసీల్దార్ జి.ప్రభాకరరావు, డాక్టర్ వెంకటేశ్వరప్రసాద్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై యువత ఆసక్తి చూపాలి

- వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న హనిమిరెడ్డి

పంగులూరు, జనవరి 9: క్రీడల పట్ల యువత ఆసక్తి చూపాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం హనిమిరెడ్డి అన్నారు. మంగళ వారం మండలంలోని కొండమంజులూరులో సంక్రాంతి సందర్భంగా కేసీసీ నిర్వహిస్తున్న జాతీయస్థాయి టీ20 క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతమైన కొండమంజులూరులో క్రికెట్ పోటీలను నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. కేసీసీ ఛైర్మన్ కరణం స్వామి నేతృత్వంలో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో బీవీ కృష్ణారెడ్డి, జంపాని రవిబాబు, బొప్పూడి వెంకన్నబాబు, జంపని రాజేష్, బొప్పూడి వేణుబాబు, వీరాంజనేయులు, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంపై గెలుపొందిన బుల్స్ ఒంగోలు జట్టు

ప్రారంభ మ్యాచ్‌లో ప్యాంథర్స్ శ్రీకాకుళం జట్టుపై బుల్స్ ఒంగోలు జట్టు 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. టాస్ గెలిచిన బుల్స్ ఒంగోలు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేపట్టిన శ్రీకాకుళం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 157 పరుగులు చేసింది. 158 ప రుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన బుల్స్ ఒంగోలు జట్టు ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 15 ఓవర్లలో 158 పరుగులు చేసింది. బుల్స్ ఒంగోలు జట్టు క్రీడాకారుడు కె.ఆనంద్‌జోష్య 49 బంతులలో 3 సిక్స్‌లు, 12 ఫోర్లతో 80 పరుగులు సాధించారు. అచ్యుత కుమార్, పాశమ్ నవీన్‌లు చెరి రెండు వికెట్లు తీసుకుని జట్టు విజయానికి తోడ్పడ్డారు. బుధవారం జరిగే పోటీలలో ఉదయం మస్తాన్ లెవెన్ జార్ఖాండ్ జట్టు, చెన్నై జట్టు తలపడనున్నాయి. సాయంత్రం జరిగే పోటీలో జడ్-11 హైదరాబాద్, మాక్ ఎస్‌జీ బళ్ళారి జట్టు పోటీ పడనున్నట్టు కరణం స్వామి తెలిపారు.



బల్లికురవ మండల వైసీపీ నేతలతో మాట్లాడుతున్న కృష్ణచైతన్య

అధిష్ఠానం పునరాలోచన చేయాలి

- వైసీపీ బలోపేతం కోసం అహర్నిశలు కష్టపడ్డా!
- శాప్‌నెట్ ఛైర్మన్ బాచిన కృష్ణచైతన్య

అద్దంకి. జనవరి 9: అద్దంకి నియోజకవర్గంలో వైసీపీ బలోపేతం కోసం అహర్నిశలు కష్టపడ్డానని శాప్‌నెట్ ఛైర్మన్ బాచిన కృష్ణచైతన్య అన్నారు. అధిష్ఠానం పునరాలోచన చేసి తిరిగి తనకే టికెట్ ఇస్తుందన్న నమ్మకం ఉందన్నారు. కార్యకర్తలు, నేతలు అధైర్య పడవద్దని చెప్పారు. మంగళవారం అద్దంకి పట్టణ వైసీపీ కార్యాలయంలో బల్లికురవ మండల నేతలతో కృష్ణచైతన్య సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణ, జరగబోయే రాజకీయ పరిణామాలపై చర్చించారు. అనంతరం గ్రామాల నుంచి వచ్చిన నేతల అభిప్రాయాలను అడిగి తెలుసుకొన్నారు. ఈసందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ ఎవరూ తొందర పడవద్దని, అందరం కలిసికట్టుగా ఉందామన్నారు. సర్వే మరలా జరుగుతందని తెలిపారు. సమావేశంలో వైసీపీ మండల అధ్యక్షుడు చింతల పేరయ్య, మాజీ సొసైటీ అధ్యక్షుడు మాదాల నాగేశ్వరరావు, జడ్పీటీసీ చింతల అంజలి శ్రీనివాసరావు, దివ్వె రామాంజనేయులు, సర్పంచ్‌లు దూళిపాళ్ల బుల్లిరామయ్య, బైలడుగు సుబ్బారావు, అమరనేని రమేష్, నేతలు గోరంట్ల వెంకటేశ్వర్లు, కమతం శ్రీను, దానానాయక్, షేక్ శ్రీనువలి, జాన్‌బాషా, మందా వీరాంజనేయులు, మక్కెన స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

15వ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె

అద్దంకిటౌన్, జనవరి 9: మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులందరిని రెగ్యులర్‌చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె మంగళవారానికి 15వ రోజుకు చేరింది. ఈసందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద జైల్ భరో కార్యక్రమానికి సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పెనుబాక ఆదాము, గాలి బీష్మా, బత్తుల కృష్ణ, వీరయ్య, అంజమ్మ, ఆలివేలు, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫాతిమా షేక్ జయంతి

అద్దంకిటౌన్, జనవరి 9: అద్దంకిలోని శ్రీచైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో పలు ప్రజాసంఘాలతో కలిసి ఫాతిమా షేక్ 193వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ ఫాతిమా షేక్ భారతదేశం మొట్టమొదటి ముస్లిం మహిళ ఉపాధ్యాయురాలు అని పేర్కొన్నారు. పూలే దంపతులతో కలిసి సంఘ సంస్కరణలు, సామాజిక కార్యక్రమాలలో పాల్గొని నిమ్న జాతులకు అపారమైన సేవలు అందించారని కొనియాడారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, అన్నమనేని వెంకటరావు, చెన్నుపల్లి నాగేశ్వరరావు, జ్యోతి చంద్రమౌళి, త్రిమూర్తులు, దేవపాలన, మురళీకృష్ణ, తదిరులు పాల్గొన్నారు.

యువత నైపుణ్యాభివృద్ధి పొందాలి

అద్దంకిటౌన్, జనవరి 9: దళిత యువత ఉపాధితో కూడిన నైపుణ్యాభివృద్ధి పొందాలని స్కిల్ డవలప్‌మెంట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ జె.గోపినాద్ అన్నారు. అద్దంకిలోని వైఎస్ఆర్ కాంత్రిపథం కార్యాలయంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం యువతకు ఉద్యోగ ఉపాధి నైపుణ్యాభివృద్ధి అవకాశాలు-సవాళ్లు అనే అంశంపై జిల్లాస్థాయి సదస్సు డీబీఆర్‌సీ ఏరియా కోఆర్డినేటర్ పులిపాటి వీరయ్య అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో రిజనల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, ఏపీఎం కోటేశ్వరరావు, ఉద్యాన అధికారి దీప్తి, భగవాన్‌దాస్, కె.బుజ్జిబాబు, పులిపాటి హేబేలు, ఆంజనేయులు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లు అందజేత

అద్దంకిటౌన్, జనవరి 9: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మంగళవారం కాకానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లను రోటరీ క్లబ్ సభ్యులు అందజేశారు. కొత్తమాసు చంద్రశేఖరరావు సౌజన్యంతో వీటిని అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని మురళీకృష్ణ, చప్పిడి వీరయ్య, సందిరెడ్డి శ్రీనివాసరావు, కొల్లా భువనేశ్వరి, మలాది శ్రీనివాసరావు, డాక్టర్ యు.దేవపాలన, హెచ్‌ఎం గురవయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సంపూర్ణ వైద్యం అందించడమే లక్ష్యం

చినగంజాం, జనవరి 9: ఖర్చు లేకుండా ప్రతి ఇంటికి సంపూర్ణ వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని మున్నంవారిపాలెం సర్పంచ్ నల్లమోపు పద్మావతి, ఎంపీడీవో కె.స్వరూపరాణి అన్నారు. మండలంలోని మున్నంవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో రెండోవిడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.వి జయభాస్కరరావు, పి.సాయిశ్రీచరణ్, స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ కె.షణ్ముఖశ్రీ, డాక్టర్ జి.పృథ్వీలు 348 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డీవోపి పి.వెంకటేశ్వర్లు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మునిరత్నం, చినగంజాం పీహెచ్‌సీ సీహెచ్‌వో పి.ఝాన్సీరాణి, పీహెచ్ఎన్ ఎస్.బేబి, సూపర్‌వైజర్లు చిరంజీవి, ఉల్బారాణి, పొదలి రాఘవ, ఎన్.మురళి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల తనిఖీలు

మార్టూరు, జనవరి 9: మార్టూరు సబ్ డివిజన్ పరిధిలో మంగళవారం విద్యుత్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో కరెంటు మీటర్లు తిరగకుండా ఏర్పాటుచేసిన ఇద్దరు వినియోగదారులకు, 38 మంది అదనపు లోడు వినియోగించేవారిని గుర్తించి రూ.2 లక్షల 81 వేలు అపరాధ రుసుం విధించారు. ఈ తనిఖీలలో అద్దంకి ఈఈ ఎన్.మస్తానరావు, మార్టూరు డీఈఈ సురేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

పర్చూరు, జనవరి 9: మండలంలోని వీరన్నపాలెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒక మహిళతోపాటు, బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తున్న మరో వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 77 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై రవి శంకర్‌రెడ్డి తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం

చీరాల, జనవరి 9: టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం ఉంటుందని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య తనయుడు గౌరీఅమర్‌నాథ్ అన్నారు. మండలంలోని దేవినూతలలో మంగళవారం రాత్రి టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి జయహో బీసీ ప్రచారంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు బీసీల అభ్యున్నతి కోసం చేపట్టిన పథకాలను వివరించారు. కార్యక్రమంలో వల్లు చినరాఘవులు, మల్లవరపు శ్రీను, నల్లమేకల సోమయ్య, మల్లవరపు వెంకటశివయ్య, గడ్డం నీవన్, గంజి పురుషోత్తమ్, కౌతవరపు జనార్దనరావు, అంగిరేకుల వెంకటేశ్వర్లు, రాపూరి శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్మా పేరుతో ఉద్యమాన్ని అణచలేరు

పంగులూరు, జనవరి 9: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అంగన్‌వాడీలు కొనసాగిస్తున్న సమ్మెను ఎస్మా పేరుతో అణచివేయలేరని సీఐటీయూ నేత మల్లారెడ్డి హెచ్చరించారు. పంగులూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మెలో భాగంగా మంగళవారం నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీల శిబిరం వద్ద మల్లారెడ్డి మాట్లాడారు. తమ సమస్యలు పరిష్కారమయ్యేవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని అంగన్‌వాడీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.